ఆరుగురు జాలర్లపై సముద్ర దొంగల దాడి

● రూ.4లక్షల విలువైన వస్తువుల దోపిడీ



శ్రీలంక సముద్ర దొంగల దాడిలో గాయపడి తిరిగొచ్చిన జాలర్లు

చెన్నై, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): నాగపట్టినం జిల్లా వేదారణ్యం సమీపంలో సముద్రంలో చేపలవేట సాగిస్తున్న ఆరుగురు జాలర్లపై శ్రీలంక సముద్ర దొంగల ముఠా దాడి చేసి, రూ.4లక్షల విలువైన వలలు, యంత్రపరికరాలు తదితర సామగ్రిని దోచుకెళ్లింది. వేదారణ్యం సమీపం కోడియకరై నుంచి అక్కరపేటకు చెందిన విజయకుమార్‌కు సొంతమైన ఫైబర్‌పడవలో అదే ప్రాంతానికి చెందిన జాలర్లు రాజ్‌కుమార్, రాజేంద్రన్, నాగలింగం శుక్రవారం మధ్యాహ్నం చేపల వేటకు సముద్రంలోకి వెళ్లారు. కోడియకరైకి ఆగ్నేయంగా సముద్రంలో చేపలు పడుతుండగా రెండు పడవల్లో వచ్చిన ఆరుగురు శ్రీలంక సముద్ర దొంగల ముఠా సభ్యులు చుట్టుముట్టి కత్తులు, కట్టెలతో ముగ్గురు జాలర్లను చితకబాదారు. ఆ తర్వాత పడవలో ఉన్న రూ.3లక్షల విలువైన వలలు, జీపీఎస్ పరికరం తదితర సామగ్రిని దోచుకుని మెరుపు వేగంతో పారిపోయారు. ఈ దాడిలో రాజేంద్రన్ తలకు బలమైన గాయాలయ్యాయి. రాజ్‌కుమార్‌కు తలపై కత్తిపోటు గాయమైంది. మరో జాలరి నాగలింగంకు వంటి నిండా గాయాలయ్యాయి. శనివారం వేకువజామున స్వస్థలానికి గాయాలతో అంతా పోగొట్టుకుని ఒట్టి చేతులతో తిరిగొచ్చిన ఈ ముగ్గురు జాలర్లను చూసి స్థానికులు దిగ్భ్రాంతి చెందారు. ఈ ముగ్గురినీ స్థానిక జాలర్ల సంఘం నాయకులు చికిత్స నిమిత్తం వేదారణ్యం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

మరో సంఘటన..

వేదారణ్యం సమీపం పెరుమాళ్‌పేటకు చెందిన జాలర్లు కుమార్, లక్ష్మణన్, జగన్ కోడియకరై వద్ద సముద్రంలో చేపలుపట్టేందుకు వెళ్లారు. వీరిని కూడా శ్రీలంక సముద్ర దొంగలు చుట్టుముట్టి కత్తులు, కొడవళ్లతో దాడి జరిపి పడవలో ఉన్న రూ.లక్ష విలువైన వస్తువులను దోచుకెళ్లారు. ఈ ముగ్గురు జాలర్లు కూడా శనివారం ఉదయం పెరుమాల్‌పేట ఒడ్డుకు చేరారు. వంటి నిండా గాయాలతో వచ్చిన వీరిని కూడా స్థానికులు చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ఓ వైపు శ్రీలంక నావికాదళం అక్రమ నిర్బంధాలు, మరోవైపు శ్రీలంక సముద్రపు దొంగల దాడి దోపిడీలు జరుగుతుండటంతో చేపలవేటకు వెళ్లే తమ ప్రాణాలకు రక్షణ లేకుండాపోయిందని జాలర్లు వాపోతున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జోక్యం చేసుకుని తమిళ జాలర్లు నిర్భయంగా చేపలవేట సాగించేలా పటిష్ఠ చర్యలు చేపట్టాలని జాలర్ల సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

తగిన సమయంలో గుణపాఠం

● బీజేపీకి స్టాలిన్ హెచ్చరిక



చెన్నై క్యాంపు కార్యాలయంలో తనను కలుసుకున్న సాహిత్య అకాడమీ అవార్డుకు ఎంపికైన ప్రముఖ రచయిత ఎ.ఆర్. వెంకటాచలపతిని శాలువతో సత్కరిస్తున్న ముఖ్యమంత్రి స్టాలిన్

చెన్నై, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఓ వైపు భారత రాజ్యాంగ ఉత్సవాలు జరుపుతూ మరో వైపు ఆ రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌ను కించపరిచేలా విమర్శిస్తున్న కేంద్రంలోని బీజేపీ పాలకులకు ప్రజలు అనువైన సమయంలో గుణపాఠం చెప్పడం ఖాయమని ముఖ్యమంత్రి స్టాలిన్ ధ్వజమెత్తారు. ఈ మేరకు శనివారం ఉదయం ఆయన ఓ సుదీర్ఘ ప్రకటన వెలువరించారు. పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో డీఎంకే ఎంపీలు కీలకమైన అంశాలపై కేంద్రప్రభుత్వాన్ని నిలదీసి, సమర్థవంతంగా వ్యవహరించారన్నారు. దీనిపై ఇతర రాష్ట్రాల జాతీయ పార్టీల నేతలు ప్రశంసల వర్షం కురిపిస్తున్నారని పేర్కొన్నారు. పార్లమెంట్ శీతాకాల సమావేశాలు నవంబర్ 25న ప్రారంభమై డిసెంబర్ 20న ముగిశాయని, ఈ సమావేశాలలో సునిశిత శిక్షణ పొందిన సైనికుల్లా డీఎంకే ఎంపీలంతా ప్రవర్తించారన్నారు. అదే సమయంలో రాష్ట్ర హక్కుల సాధన దిశగా హుందాగా వ్యవహరించిన తీరు దేశమే మెచ్చుకుంటోందన్నారు. అదానీ వ్యవహారం, మణిపూర్ అల్లర్ల గురించి బాధ్యతాయుతమైన ప్రధాని పదవిలో ఉంటూ ఇంకా నోరుమెదపకుండా ఉంటున్న మోదీ నాయకత్వంలో ప్రజాస్వామ్యం అష్టకష్టాలు పడుతోందన్నారు. పార్లమెంట్ సమావేశాలను సజావుగా సాగించాలన్న తలంపు మోదీకి ఏమాత్రం లేదని, ప్రతిపక్షాలు ఏదైనా సమస్యను పెద్దదిగా చేసుకుని సమావేశాలను స్తంభింపజేస్తే తమ తప్పిదాలు బయపడకుండా ఉంటాయనే అప్రమత్తంగా వ్యవహరించారన్నారు. శీతాకాల పార్లమెంట్ సమావేశాలు గురించి పార్లమెంటరీ వ్యవహారాల కమిటీ జారీ చేసిన ప్రకటనలో లోక్‌సభ 54.5 శాతం, రాజ్యసభ 40 శాతం మేరకు సమర్థవంతంగా పనిచేసినట్లు పేర్కొన్నారని, సమావేశాలు సజావుగా సమర్థవంతంగా సంపూర్ణంగా నిర్వహించలేదని ఆ ప్రకటన రుజువుచేస్తోందని తెలిపారు.

రాజ్యాంగ రచయితపై విమర్శలా?

భారత రాజ్యంగం 75వ వార్షికోత్సవాలు ఘనంగా జరుపుకోవాల్సిన సమయంలో ఆ రాజ్యాంగ రచయిత అంబేద్కర్‌పై హోంమంత్రి అమిత్‌షా విమర్శలు చేయడం గర్హనీయమన్నారు. ఇవన్నీ బీజేపీ పాలకుల పాసిస్టు ధోరణకి నిదర్శనమన్నారు. ఇంతటి గందరగోళం నడుమ పార్లమెంట్ ఉభయ సభల్లో డీఎంకే ఎంపీలు ప్రధానమైన అంశాలపై పాలకులను నిలదీయడంపై వెనుకంజ వేయలేదని, జమిలి ఎన్నికలపై డీఎంకే లోక్‌సభాపక్ష నాయకుడు టీఆర్ బాలు, మదురై సమీపం మేలూరు వద్ద టంగ్‌స్టన్ తవ్వకాలకు అనుమతి రద్దు చేయాలని తన సోదరి కనిమొళి, ప్రధానమైన చర్చలు జరుగుతున్నప్పుడు ప్రధాని నరేంద్ర మోదీ సభకు గైర్హాజరవుతున్నారంటూ తిరుచ్చి శివా, బీజేపీ పాలకులు అనుసరిస్తున్న మతతత్వ వాదాన్ని ఎండగడుతూ జగద్రక్షకన్ కొదమసింహాల్లా విరుచుకుపడ్డారని స్టాలిన్ వివరించారు.

కేంద్రం తీరును ఎండగట్టారు...

తమిళ జాలర్లను శ్రీలంక నావికాదళం అదే పనిగా అక్రమంగా నిర్బంధించడం, తమిళజాలర్ల విడుదల, రాష్ట్రంలో అమలు చేయాల్సిన రైల్వే పథకాలు, రెండో దశ మెట్రోరైలు ప్రాజెక్టుకు నిధుల విడుదల, సమగ్ర శిక్షా అభ్యాయన్ పథకం కింద రాష్ట్రానికి నిధులు విడుదల చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడం, రైతులకు పీఎం కిసాన్ పథకం కింద నిధులు కేటాయించకపోవడం, టోల్‌గేట్ల రద్దు ప్రతిపాదన, నిరుద్యోగ సమస్య, వక్ఫ్‌బోర్డు చట్ట సవరణకు వ్యతిరేకత వంటి కీలకమైన అంశాలపై డీఎంకే ఎంపీలు సమర్థవంతంగా సభలో ప్రసంగించి పాలకుల తప్పిదాలను ఎండగట్టారని స్టాలిన్ పేర్కొన్నారు. ఇకనైనా కేంద్రంలోని బీజేపీ పాలకుల తమ వైఖరిని మార్చుకోకుంటే తొలుతగా తమిళ ప్రజలే గట్టి గుణపాఠం చెబుతారని, ఆ తర్వాత అన్ని రాష్ట్రాల ప్రజలూ కలిసి మళ్లీ కోలుకోలేనంతగా గట్టి పాఠం చెబుతారని స్టాలిన్ హెచ్చరించారు.

న్యూఇయర్ ‘కఠిన’ వేడుకలు

చెన్నైలో పోలీసుల నిబంధనలు ● పుదుచ్చేరిలో ఒంటిగంట వరకూ మద్యపానం



చెన్నై/పుదుచ్చేరి, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): నగరంలో నూతన సంవత్సర వేడుకల సందడి మొదలైంది. షాపింగ్ మాల్స్, రిసార్టులు, స్టార్ హోటళ్లు, ప్రైవేటు విడిది గృహాలు వేడుకలకు సిద్ధమవుతున్నాయి. ఈ నేపథ్యంలో, ఆంగ్ల సంవత్సరాది వేడుకల నిర్వహణపై గ్రేటర్ చెన్నై పోలీసు విభాగం పలు కఠిన నిబంధనలు విధించింది. నూతన సంవత్సరం సందర్భంగా మహాబలిపురం, ఈసీఆర్ ప్రాంతాల్లో రాత్రి 12 గంటలకు పైగా వినోద కార్యక్రమాలు నిర్వహించరాదని తెలిపింది. అలాగే, డిసెంబరు 31వ తేది సాయంత్రం 6 గంటల నుంచి స్విమ్మింగ్ పూల్స్ మూసివేయాలని, హోటళ్లలో సీసీ టీవీ కెమెరాల పనితీరు నిర్ధారించాలని తెలిపింది. ప్రైవేటు హోటళ్లు గుర్తింపుకార్డులు లేని వారికి గదులు అద్దెకివ్వరాదని, తీర ప్రాంత రిసార్టుల్లో రాత్రి 12 గంటలకు పైన వినోద కార్యక్రమాలు నిర్వహించరాదని పేర్కొంది. శుభాకాంక్షలు తెలిపేలా మహిళలను కించపరచడం, హేళనకు పాల్పడితే కఠిన చర్యలుంటాయని నగర పోలీసు శాఖ హెచ్చరించింది.

పుదుచ్చేరిలో అర్ధరాత్రి ఒంటిగంట వరకు మద్యం విక్రయాలు...

కేంద్రపాలిత రాష్ట్రం పుదుచ్చేరి నూతన సంవత్సర వేడుకలకు ముస్తాబవుతోంది. పుదుచ్చేరిలో జరిగే వేడుకలకు పలు జిల్లాలు, పొరుగు రాష్ట్రాల నుంచి యువతీ, యువకులు పెద్దసంఖ్యలో హాజరవుతుంటారు. అటు ప్రభుత్వం, ఇటు ప్రైవేటు సంస్థలు నూతన సంవత్సరం వేడుకల్లో పలు వినోద కార్యక్రమాలు అందిస్తుంటాయి. వేడుకల్లో పాల్గొనే యువతీ, యువకులు మద్యం తాగి ఆటపాటలతో సందడి చేస్తుంటారు. ఈ క్రమంలో, రాష్ట్రంలో మద్యం విక్రయాల సమయాన్ని పెంచుతూ రాష్ట్ర ఎక్సైజ్ శాఖ జాయింట్ కమిషనర్ మాథ్యూ ఫ్రాన్సిస్ ఉత్తర్వులు జారీ చేశారు. ఆ ప్రకారం, ఉదయం 8 నుంచి రాత్రి 11 గంటల వరకు పనిచేసే మద్యం దుకాణాలు (రిటైల్, హోల్‌సేల్) రాత్రి 11.30 గంటల వరకు పనిచేయనున్నాయి. అందుకు దుకాణాల యజమానులు రూ.5,000 రుసుము చెల్లించాలి. అలాగే బార్లతో కూడిన హోటళ్లు అర్ధరాత్రి ఒంటిగంట వరకు పనిచేసేందుకు అనుమతించగా, అందుకు వాటి యజమానులు రూ.10,000 చెల్లించాల్సి ఉంటుంది. ఇక, బార్లతో పనిచేసే రెస్టారెంట్లు నూతన సంవత్సరం సందర్భంగా ఆట పాటలు, వినోద కార్యక్రమాల నిర్వహణకు రూ.15,000 చెల్లించాలని స్పష్టం చేశారు.

ఈరోడ్ ఈస్ట్ ఉపఎన్నికలో డీఎంకే పోటీ?!

● బరిలో దిగేందుకు కాంగ్రెస్ విముఖత!

చెన్నై, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఈరోడ్ ఈస్ట్ అసెంబ్లీ నియోజకవర్గానికి జరగనున్న ఉపఎన్నికలో పోటీ చేయడానికి రాష్ట్ర కాంగ్రెస్ సుముఖంగా లేదని తెలిసింది. ఇప్పటికే వరుసగా రెండుమార్లు అక్కడి నుంచి గెలిచిన తాము..ఈసారి ఆ స్థానాన్ని డీఎంకేకు కేటాయించాలని భావిస్తున్నట్లు సమాచారం. ఆ నియోజకవర్గంలో మూడేళ్ల వ్యవధిలో రెండుసార్లు పోటీ చేసిన కాంగ్రెస్ అభ్యర్థులు మృత్యువాత పడటంతో.. అక్కడి నేతల్లో భయం నెలకొన్నట్లు సమాచారం. 2021లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఈరోడ్ ఈస్ట్ నియోజకవర్గంలో టీఎన్‌సీసీ మాజీ నేత ఈవీకేఎస్ ఇళంగోవన్ కుమారుడు తిరుమగన్ ఈవేరా పోటీ చేసి గెలిచారు. రెండేళ్ల తర్వాత ఆయన ఆకస్మికంగా మృతి చెందారు. ఈ నేపథ్యంలో మార్చిలో జరిగిన ఉపఎన్నికలో ఈవీకేఎస్ ఇళంగోవన్ కాంగ్రెస్ తరపున పోటీ చేసి గెలిచారు. ఈనెల 14న అనారోగ్య కారణాల వల్ల ఆయన మృతి చెందారు. దీంతో ఆ నియోజకవర్గం ఖాళీ అయినట్లు ఎన్నికల సంఘం ప్రకటించింది. ఆ నియోజకవర్గంలో ఆరు నెలల్లో ఉప ఎన్నిక జరపాల్సి ఉంది. ఆ మేరకు రాష్ట్రఎన్నికల సంఘం అధికారులు ఈరోడ్ ఈస్ట్ నియోజకవర్గం ఉపఎన్నికల ముందస్తు ఏర్పాట్లను ముమ్మరంగా చేపడుతున్నారు. ఫిబ్రవరిలో రాజ్యసభ ఎన్నికలు జరగనుండటంతో ఆ ఎన్నికలతో పాటే ఈరోడ్ ఈస్ట్ ఉప ఎన్నికలను కూడా జరపాలని ఎన్నికల అధికారులు భావిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో ఆ నియోజకవర్గంను కూటమికి నాయకత్వం వహిస్తున్న డీఎంకేకి విడిచిపెట్టేందుకు రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ సిద్ధమైంది. ఆ నియోజకవర్గంలో ఈవీకేఎస్ రెండో కుమారుడు సంజయ్‌ని పోటీకి దింపేందుకు కాంగ్రెస్ నేతలు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. తాను ఎన్నికల్లో పోటీ చేసే ప్రసక్తే లేదని డీఎంకే అధ్యక్షుడు, ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్‌ను కలుసుకుని సంజయ్ స్పష్టంగా ప్రకటించారు. ఈ పరిస్థితుల్లో ఆ నియోజకవర్గంలో పోటీ చేయడానికి సమర్థుడైన అభ్యర్థి కూడా లేరని కాంగ్రెస్ నేతలు చెబుతున్నారు. రెండు రోజుల క్రితం స్టాలిన్ ఈరోడ్‌లో పార్టీ నిర్వాహకుల సమావేశంలో పాల్గొన్నప్పుడు ఈరోడ్ ఈస్ట్ ఉప ఎన్నికల ప్రస్తావన కూడా వచ్చింది. కాంగ్రెస్ సీటును విడిచిపెడితే, తాము సిద్ధమని డీఎంకే శ్రేణులు తెలిపారు. దీంతో అక్కడి నుంచి డీఎంకే పోటీ చేయడం దాదాపు ఖాయమైపోయినట్లు తెలిసింది.

25నుంచి మళ్లీ కుండపోత వర్షాలు!

చెన్నై, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో వాయుగుండం కారణంగా ఈ నెల 25, 26 తేదీల్లో సముద్రతీర జిల్లాల్లో పలుచోట్ల కుండపోత వర్షం కురిసే అవకాశముందని చెన్నై వాతావరణ పరిశోధన కేంద్రం అధికారులు పేర్కొన్నారు. ప్రస్తుతం మధ్య, పడమటి బంగాళాఖాతంలో బలపడిన అల్పపీడనం గంటకు 7 కి.మీ.ల వేగంతో తీరం వైపు పయనిస్తోందని పేర్కొన్నారు. అల్పపీడనం కారణంగా తీర ప్రాంతాల్లో చెదురుముదురుగా వర్షాలు కురిసే అవకాశాలు ఉండటంతో ఈనెల 23న వరకు జాలర్లు చేపలవేట మానుకుంటేనే మంచిదన్నారు. రాష్ట్రంలో రానున్న మూడు రోజుల్లో పగటిపూట ఉష్ణోగ్రతలు సాధారణ స్థాయికంటే అధికంగా ఉంటాయని పేర్కొన్నారు. రాత్రి వేళల్లో పుదుకోట, శివగంగ, మదురై తదితర జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, పెనుగాలులతో వర్షాలు కురుస్తాయన్నారు. ప్రస్తుతం బంగాళాఖాతంలో ఉన్న అల్పపీడనం పూర్తిగా బలహీనపడిన తర్వాత వాయుగుండంగా రూపుదిద్దుకుని తీరం వైపు పయనించనుందన్నారు. దీని ప్రభావంతో ఈ నెల 25, 26 తేదీలలో సముద్రతీర జిల్లాలో పలుచోట్ల కుండపోతగా, మరికొన్ని ప్రాంతాల్లో ఓ మోస్తరుగా వర్షాలు కురుస్తాయని వివరించారు. ఈశాన్య రుతుపవనాలు వచ్చే జనవరి మొదటి వారం దాకా కొనసాగుతాయని, జనవరి 10 తర్వాత వర్షాలు తగ్గుముఖం పడతాయని అధికారులు అంచనా వేశారు.

గతానుభవాలు పునరావృతమైతే తగిన విధంగా స్పందిస్తాం

● మంత్రి రఘుపతి హెచ్చరిక



మీడియాతో మాట్లాడుతున్న మంత్రి రఘుపతి

పెరంబూర్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): గత శాసనసభ సమావేశాల అనుభవాలు పునరావృతమైతే తగిన విధంగా స్పందిస్తామని రాష్ట్ర గవర్నర్‌కు న్యాయశాఖ మంత్రి రఘుపతి పరోక్షంగా హెచ్చరించారు. ఆ సమావేశాల్లో జరిగిన ఘటనలు మళ్లీ తలెత్తవని ఆశిస్తున్నామని, ఒకవేళ అలాంటివి జరిగితే తగిన విధంగా బదులిస్తామన్నారు. పుదుకోట కార్పొరేషన్ అశోక్ నగర్‌లో 24 గంటల తాగునీటి సరఫరాను శుక్రవారం మంత్రి రఘుపతి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... జనవరి 6నుంచి గవర్నర్ ప్రసంగంతో శాసనసభ సమావేశాలు ప్రారంభమవుతాయని స్పీకర్ అప్పావు ప్రకటించారన్నారు. ఈసారి జరుగనున్న సమావేశాల్లో గవర్నర్ ప్రసంగం సజావుగా ఉంటుందని ఆశిస్తున్నట్లు తెలిపారు. ఉప కులపతి నియామక వ్యవహారంలో ఏర్పాటుచేసిన ఎంపిక కమిటీ గవర్నర్ ఇష్టానుసారంగా ఉండబోదన్నారు. ఎంపిక కమిటీలో ముగ్గురు మాత్రమే ఉంటారని, నాల్గో వ్యక్తికి చోటులేదన్నారు. ఈ విషయమై న్యాయస్థానానికి వెళ్లినా ప్రయోజనం ఉండదన్నారు. సంక్రాంతి రోజున నిర్వహించనున్న యూజీసీ-నెట్ పరీక్ష వాయిదా వేయాలని కేంద్రప్రభుత్వానికి విజ్ఞప్తి చేశామన్నారు. తిరునల్వేలి కోర్టు ప్రాంగణంలో యువకుడు హత్యకు గురైన ఘటనలో రెండు గంటల్లోనే నిందితులను అరెస్ట్ చేశామన్నారు. అన్ని ఘటనలనూ ప్రభుత్వం అప్పటికప్పుడు అడ్డుకోవడం సాధ్యం కాదన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు అదుపులో ఉన్నాయని, నేరాలు, హత్యలకు పాల్పడే వారిని సత్వరం అరెస్ట్ చేస్తున్నామని మంత్రి తెలిపారు.

విమాన చార్జీలకు రెక్కలు!



వరుస సెలవులతో మోత ● బెంబేలెత్తిపోతున్న ప్రయాణికులు

అడయార్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): క్రిస్మస్, ఆంగ్ల సంవత్సరాది తదితరాలతో వరుసగా వచ్చిన సెలవులతో విమాన చార్జీలకు రెక్కలొచ్చాయి. ఈ నెల 25న క్రిస్మస్, జనవరి 1న కొత్త సంవత్సరంతో పాటు శని, ఆదివారాలు రావడంతో వరుస సెలవులు వచ్చాయి. దీన్ని క్యాష్ చేసుకునేందుకు విమానయాన సంస్థలు చార్జీలను మూడు నాలుగు రెట్లు పెంచేశాయి. ఈ ప్రయాణ చార్జీలను చూసిన ప్రయాణికులు బెంబేలెత్తిపోతున్నారు. క్రిస్మస్, న్యూ ఇయర్‌కు సొంతూళ్ళకు నగర వాసులు వెళ్తుంటారు. ఈనెల 25వ తేదీ బుధవారం క్రిస్మస్ పండుగ, 28, 29వ తేదీల్లో శని, ఆదివారాలు వస్తున్నాయి. దీంతో అనేకమంది తమ కుటుంబ సభ్యులతో కలిసి సొంతూళ్ళకు బయలుదేరి వెళ్లనున్నారు. అయితే, రైళ్ళు, బస్సుల్లో ముందస్తు రిజర్వేషన్లతో టిక్కెట్లు నిండుకున్నాయి. ప్రైవేటు బస్సు యజమానులు చార్జీల మోత మోగిస్తున్నారు. ఇపుడు విమానయాన సంస్థలు కూడా ఇష్టారాజ్యంగా ధరలను పెంచేశాయి. అనేక మార్గాల్లో మూడు, నాలుగు రెట్లు ఈ చార్జీలను పెంచాయి.

చార్జీల మోత ఇలా...

చెన్నై నుంచి తూత్తుక్కుడికి సాధారణ రోజుల్లో విమాన ప్రయాణ చార్జీ రూ.4796 ఉండగా, ఇపుడు ఈ ధరను రూ.14281కు పెంచేశారు. అలాగే, మదురైకు రూ.4300 ఉండగా, ఇపుడు రూ.17695కు పెంచారు. అదేవిధంగా తిరుచ్చికి రూ.2382గా ఉండే చార్జీని రూ.14387గాను, కోయంబత్తూరుకు రూ.3485గా ఉండే చార్జీని రూ.9418గాను, సేలంకు రూ.3534 నుంచి రూ.8007గాను, తిరువనంతపురానికి రూ.3821 నుంచి రూ.13306గాను, కొచ్చిన్‌కు రూ.3678 ఉంచి రూ.18377గాను, మైసూర్‌కు రూ.3432 నుంచి రూ.9872గాను, సింగపూర్‌కు రూ.7510 నుంచి 16861గాను, కౌలాలంపూర్‌కు రూ.11016 నుంచి రూ.33903గాను, థాయ్‌లాండ్‌కు రూ.8891 నుంచి రూ.17437గాను, దుబాయ్‌కు రూ.12871 నుంచి రూ.26752గా విమాన సంస్థలు ప్రయాణ చార్జీలను పెంచేశాయి.

వార్డుల పునర్విభజన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు

హైకోర్టుకు నివేదించిన రాష్ట్ర ప్రభుత్వం

పెరంబూర్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): వార్డుల పునర్విభజన, రిజర్వేషన్ల ప్రక్రియ పూర్తయిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తామని మద్రాసు హైకోర్టుకు రాష్ట్రప్రభుత్వం స్పష్టం చేసింది. 2019లో జరిగిన స్థానిక సంస్థల పదవీకాలం 2025 జనవరి 5వ తేదీన, కొత్తగా ఏర్పాటైన జిల్లాల్లో 2021లో నిర్వహించిన స్థానిక సంస్థల పదవీకాలం 2026 సెప్టెంబరులో ముగియనుంది. ఈ నేపథ్యంలో, అన్ని స్థానిక సంస్థలకు ఒకేసారి ఎన్నికలు నిర్వహిస్తారా? వచ్చే ఏడాది పదవీకాలం ముగిసిన 27 జిల్లాలకు మాత్రమే ఎన్నికలు నిర్వహిస్తారా అనే చర్చ సాగుతోంది. వార్డుల పునర్విభజన ప్రక్రియ జరుగుతున్న నేపథ్యంలో, పనులు సత్వరం పూర్తిచేసి ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేయాలని కోరుతూ మద్రాసు హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలైంది. ఈ కేసు విచారణకు రాగా రాష్ట్ర ప్రభుత్వం తన అభిప్రాయాన్ని లిఖితపూర్వకంగా తెలియజేసింది. వార్డుల పునర్విభజన, ఎస్సీ, ఎస్టీలు, మహిళలకు రిజర్వేషన్ కేటాయింపు తదితరాలు పూర్తయిన తర్వాతే స్థానిక ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేస్తామని తెలియజేసింది. ప్రభుత్వ వివరణను పరిగణనలోకి తీసుకున్న హైకోర్టు న్యాయమూర్తులు ఎస్ఎస్ సుందర్, ధనపాల్‌తో కూడిన ధర్మాసనం.. కేసు విచారణ ముగిసినట్లు ప్రకటించింది.

రాష్ట్రంలో క్షీణించిన శాంతి భద్రతలు: ఈపీఎస్



చెన్నై, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): డీఎంకే పాలకులు 'అంతటా అభివృద్ధి-అన్నింటా అభివృద్ధి' అంటూ మూడేళ్లుగా చెబుతూ వచ్చిన నినాదం ప్రస్తుతం మారిపోయిందని, రాష్ట్రంలో పతనస్థితికి చేరుకున్న శాంతిభద్రతలను చూస్తుంటే 'అంతటా హత్యలు - అన్నింటా హత్యలు' అనే కొత్త నినాదాన్ని తెరపైకి తీసుకువచ్చేలా ఉందని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి, మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి ఒక ప్రకటనలో ధ్వజమెత్తారు. 24 గంటల్లో రాష్ట్రంలో హత్య, హత్యాయత్నాలు అధికమయ్యాయని ఆయన పేర్కొన్నారు. తిరునల్వేలి జిల్లా కోర్టులో పోలీసుల సమక్షంలోనే విచారణకు వచ్చిన నిందితుడిని మారణాయుధాలతో దాడి జరిపి హతమార్చారని, ఈ సంఘటనను బట్టి పోలీసులు హంతకులకు గట్టి మద్దతు ఇస్తున్నట్టు తెలుస్తోందన్నారు. ఇదే విధంగా టి.నగర్‌లో బ్యాంకులో చొరబడిన దుండగులు ఉద్యోగి చెవిని నరికివేయడం, శివగంగలో తల్లి కళ్లెదుటే కుమారుడిపై దుండుగుల కత్తులతో దాడికి పాల్పడటం, అంబత్తూరులో అర్ధరాత్రి గంజాయి మత్తులో ఐదుగురు కత్తిపోట్లకు గురికావడం వంటి వరుస సంఘటనలు శాంతి భద్రతలు అట్టడుగు స్థాయికి చేరుకున్నట్లు సాక్ష్యం చెబుతున్నాయన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఇలా హత్యలు, హత్యాయత్నాలు, మానభంగాలు, దారిదోపిళ్లు జరుగుతున్నా ముఖ్యమంత్రి స్టాలిన్ నిమ్మకునీరెత్తినట్లు మౌనంగా ఉండటం గర్హనీయమన్నారు. తన పర్యటనలలో అత్యధికంగా ఫొటోషూట్‌లు జరుపుకునే స్టాలిన్ ఇకనైనా శాంతి భద్రతలపై దృష్టి సారిస్తే మంచిదని హితవు పలికారు.

సమాచార దృష్టి

వైద్య శిబిరాల కోసం '104'లో సంప్రదించండి

పెరంబూర్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): జ్వరాల వ్యాప్తి అధికంగా ఉన్న ప్రాంతాల్లో వైద్య శిబిరాల ఏర్పాటుకు '104' నెంబరులో సంప్రదించాలని ఆరోగ్య శాఖ పేర్కొంది. రాష్ట్రంలో ఇన్‌ఫ్లుయేంజా, డెంగ్యూ, చికున్ గున్యా, టైఫాయిడ్ సహా పలురకాల జ్వరాల వ్యాప్తి అధికంగా ఉంది. ఇన్‌ఫ్లుయేంజా, దోమలతో వ్యాపించే జ్వరాలతో ఆస్పత్రులకు వచ్చే రోగుల వివరాలను ఆరోగ్యశాఖ సేకరిస్తోంది. అదే సమయంలో కొన్ని ప్రైవేటు ఆస్పత్రులు జ్వరబాధితుల సమాచారం అందించడం లేదు. దీంతో జ్వర పీడితులు అధికంగా ఉన్న ప్రాంతాల్లో నివారణ చర్యలు చేపట్టలేని పరిస్థితి నెలకొంది. ఈ విషయమై దృష్టి సారించిన ఆరోగ్యశాఖ, జ్వరాల వ్యాప్తి అధికంగా ఉన్న ప్రాంతాల్లో వైద్యశిబిరాల ఏర్పాటుకు ప్రజలు ihip.-mohfw. gov.in/cbs లోగానీ, 104 నెంబరుకు తెలియజేయాలని ఆరోగ్యశాఖ తెలిపింది.

ఐఐటీ పరిశోధనల వీక్షణకు ఆహ్వానం

పెరంబూర్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మద్రాస్ ఐఐటీ ప్రాంగణంలో జనవరి 3,4 తేదీల్లో ఓపెన్ ఆడిటోరియం ఏర్పాటు చేయనున్నారు. ఐఐటీ ఆవిష్కరణలు, పరిశోధనలు, రూపొందించిన పరికరాలు, పరిశోధన వివరాలు ఈ ఆడిటోరియంలో ప్రదర్శించనున్నారు. ఆసక్తి కలిగిన వారు "shaastra.org/openhouse" లో ఈ నెల 25వ తేదిలోపు పేర్లు నమోదు చేసుకోవాలని నిర్వాహకులు పేర్కొన్నారు.

83మందికి 'సీఎం ఫార్మశీ'

పెరంబూర్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 'సీఎం ఫార్మశీ' ఏర్పాటు చేసుకునేందుకు 83 మందికి అనుమతించినట్లు ఆరోగ్య శాఖ తెలిపింది. జనరిక్ మందులు సహా సిద్ధ, ఆయుర్వేద, యునానీ మందులను ప్రజలకు తక్కువ ధరకు విక్రయించేలా 1,000 మెడికల్ షాపులు ఏర్పాటు చేయనున్నట్లు ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రకటించారు. ఈ మేరకు ఆసక్తి కలిగిన వారు వెబ్‌సైట్ ద్వారా తగిన సర్టిఫికేట్లతో దరఖాస్తు చేసుకున్నారు. ఈ నేపథ్యంలో, సీఎం ఫార్మశీ ఏర్పాటుకు 856 మంది దరఖాస్తు చేసుకోగా, 83 మందికి అనుమతులు జారీ చేసినట్లు తెలిపారు. మరో 22 మందికి త్వరలో అనుమతులు జారీ చేయనున్నారు. ఇక 751 దరఖాస్తులు పరిశీలనలో ఉన్నాయి. అనుమతించిన దుకాణాలు జనవరిలో ప్రారంభమవుతాయని అధికారులు తెలిపారు.

31 వరకు ఆదాయపు పన్ను దాఖలుకు అవకాశం

పెరంబూర్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఆదాయపు పన్ను దాఖలుకు ఈనెల 31వ తేది చివరి గడువు అని ప్రభుత్వం ప్రకటించింది. రూ.5 లక్షలకు పైగా ఆదాయం ఉన్న వారు ప్రతి ఏడాది జూలై 31వ తేదిలోపు దరఖాస్తు చేసుకోవాలి. నిర్ణీత సమయంలో ఆదాయ పన్ను దాఖలు చేయని వారు కనిష్ఠంగా రూ.1,000 నుంచి గరిష్ఠంగా రూ.5,000 జరిమానాతో ఈనెల 31వ తేది వరకు పన్ను దాఖలుకు అవకాశం కల్పించారు. ఈ గడువులోపు చెల్లించని వారికి జరిమానా రూ.10,000కు పెంచడంతో పాటు దాఖలు చేయని వారిపై చర్యలు చేపడతామని అధికారులు హెచ్చరించారు.

నెల్లై - చెన్నై ఎక్స్‌ప్రెస్ వేళల్లో మార్పులు

పెరంబూర్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా జనవరి 1వ తేది నుంచి పలు రైళ్ల సమయాలను రైల్వే శాఖ మార్చింది. ఆ ప్రకారం, దక్షిణ రైల్వే పరిధిలో తిరునల్వేలి - చెన్నై మధ్య నడిచే నెల్లై ఎక్స్‌ప్రెస్ సమయాల్లో మార్పులు చోటుచేసుకున్నాయి. తిరునల్వేలి నుంచి ప్రతిరోజు రాత్రి 8.05 గంటలకు బయల్దేరే నెం.12632 నెల్లై ఎక్స్‌ప్రెస్ 1వ తేది నుంచి రాత్రి 8.40 గంటలకు బయల్దేరి యథాప్రకారం చెన్నై ఎగ్మూర్‌కు ఉదయం 7 గంటలకు చేరుకుంటుంది. మరోమార్గంలో నెం.12631 చెన్నై ఎగ్మూర్ నుంచి ప్రతిరోజు రాత్రి 8.10 గంటలకు బయల్దేరే నెల్లై ఎక్స్‌ప్రెస్ 1వ తేది నుంచి రాత్రి 8.40 గంటలకు బయల్దేరి తిరునల్వేలికి ఉదయం 6.40 గంటలకు చేరుకుంటుంది. ఈ ప్రకారం, ప్రయాణ సమయం 30 నిమిషాలు తగ్గనుంది. ఈ వెసులుబాటుతో సెంగోట్టై నుంచి సాయంత్రం 6.05 గంటలకు బయల్దేరే ప్యాసింజర్ రైలు 8.15 గంటలకు తిరునల్వేలి చేరుకుంటుంది. ఈ రైలులో ప్రయాణించేవారు చెన్నై సహా తదితర నగరాలకు వెళ్లేందుకు నెల్లై ఎక్స్‌ప్రెస్ రైలు సమయం మార్పు అనుకూలంగా ఉంటుందని అధికారులు తెలిపారు.

4నుంచి నటరాజ ఆలయ ఆరుద్ర దర్శన వేడుకలు

పెరంబూర్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): చిదంబరం నటరాజ ఆలయ ఆరుద్ర దర్శన వేడుకలు జనవరి 4వ తేది ధ్వజారోహణంతో ప్రారంభంకానున్నాయి. 10 రోజులు నిర్వహించనున్న ఈ వేడుకల్లో 12న రథోత్సవం, 13న మార్గళి ఆరుద్ర దర్శనం జరుగనున్నాయి. వేడుకలు జరిగే 10 రోజులు శివగామసుందరి సమేత నటరాజమూర్తికి ప్రత్యేక అభిషేకాలు, అలంకరణ, దీపారాధనలు నిర్వహించడంతో పాటు సాయంత్రం సాంస్కృతిక ప్రదర్శనలు ఉంటాయని ఆలయ నిర్వాహకులు తెలిపారు.

తగ్గిన పూల ధర

వాషర్‌మెన్‌పేట, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక కోయంబేడు మార్కెట్లో నాలుగు రోజుల తర్వాత పూల ధరలు స్వల్పంగా తగ్గాయి. ఇటీవల కురిసిన వర్షాల కారణంగా పొరుగు జిల్లాలు, రాష్ట్రాల నుంచి మార్కెట్‌కు పూల దిగుమతి తగ్గడంతో వాటి ధరలు నాలుగు రెట్లు పెరిగాయి. ప్రస్తుతం వర్షాలు తగ్గుముఖం పట్టడంతో పొలాల్లో కోత పనులు చేపట్టిన రైతులు, మార్కెట్‌కు పూలను అధిక మొత్తంలో తరలిస్తున్నారు. దీంతో, మల్లె పూలు కిలో రూ.2,500 నుంచి రూ.2,300, ఐస్ మల్లి రూ.2,300 నుంచి రూ.1,800, ముల్లై రూ.750, జాజి మల్లి రూ.600, కనకాంబరాలు రూ.800, అరళి రూ.400, చామంతి రూ.100, సంపంగి రూ.230 నుంచి రూ.100, రోజా రూ.280 నుంచి రూ.180, పన్నీర్ రోజ్ రూ.200 నుంచి రూ.120 వరకు ధర తగ్గాయని వ్యాపారులు తెలిపారు.

నల్లకన్ను సెంటినరీ వేడుకలకు సీఎం



చెన్నై అన్నాఅరివాలయంలో ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్‌ను కలుసుకుని ఈనెల 26న జరగనున్న సీనియర్ కమ్యూనిస్టు నేత నల్లకన్ను శతజయంతి వేడుకల ఆహ్వానపత్రాన్ని అందజేస్తున్న సీపీఐ రాష్ట్ర కమిటీ కార్యదర్శి ఇరా ముత్తరసన్

వాషర్‌మెన్‌పేట, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): సీపీఐ సీనియర్ నేత ఆర్.నల్లకన్ను సెంటినరీ వేడుకల్లో ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ పాల్గొననున్నారు. స్థానిక కలైవానర్ ఆడిటోరియంలో ఈ నెల 29వ తేది ఉదయం 9 నుంచి రాత్రి 9 గంటల వరకు నిర్వహించనున్న వేడుకల్లో కూటమి పార్టీల నేతలు హాజరుకానున్నారు. కాగా, నల్లకన్ను సెంటినరీ వేడుకల్లో పాల్గొనాలని ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్‌ను సీపీఐ రాష్ట్ర కార్యదర్శి ముత్తరసన్ నేరుగా కలసి ఆహ్వానించారు.

చెన్నై-అండమాన్ విమానంలో సాంకేతిక లోపం

పెరంబూర్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికులతో చెన్నై నుంచి అండమాన్ బయల్దేరిన విమానంలో సాంకేతికలోపం తలెత్తడంతో అత్యవసర ల్యాండింగ్ చేశారు. ఇండిగో ఎయిర్‌లైన్స్ విమానం శనివారం ఉదయం 10.30 గంటల ప్రాంతంలో 148 మంది ప్రయాణికులతో టేకాఫ్ అయ్యేందుకు రన్‌వేపై బయల్దేరింది. ఆ సమయంలో యంత్రంలో సాంకేతిలోపాన్ని గుర్తించిన పైలెట్, రన్‌వేపై విమానాన్ని నిలిపివేశారు. సమాచారం అందుకున్న అధికారులు, సిబ్బంది అక్కడకు చేరుకుని, విమానం నుంచి ప్రయాణికులను దింపి విశ్రాంతి గదులను తరలించారు.

పుస్తక పఠనం అలవర్చుకోండి

● టీఎంసీ అధ్యక్షుడు జీకే వాసన్



పుస్తకావిష్కరణలో జీకే వాసన్, మాజీ న్యాయమూర్తి జ్యోతి మణి

పెరంబూర్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): పుస్తక పఠనాన్ని ప్రతి ఒక్కరు అలవర్చుకోవాలని తమిళ మానిల కాంగ్రెస్ అధ్యక్షుడు జీకే వాసన్ పేర్కొన్నారు. స్థానిక సీఐటీ నగర్‌లో టీఎంసీ ప్రధాన కార్యదర్శి, న్యాయవాది రాజం నాథన్ రచించిన మూడు పుస్తకాల ఆవిష్కరణ శనివారం జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జీకే వాసన్ హాజరై పుస్తకాలు ఆవిష్కరించి, తొలిప్రతులను మాజీ న్యాయమూర్తి పి.జ్యోతిమణికి అందించారు. కార్యక్రమంలో క్రిసెంట్ కళాశాల రిజిస్ట్రార్ పీఎస్ అబ్దుల్ రెహ్మాన్, క్రిసెంట్ న్యాయ పాఠశాల ప్రొఫెసర్ రాజా, అరిమ సంఘం అధ్యక్షులు, టీఎంసీ ప్రధాన కార్యదర్శి జీఆర్ వెంకటేష్, లయన్ రఘు, పార్థసారథి, మోహన సుందరం, మదివానన్, తండ్లం రవి తదితరులు పాల్గొన్నారు.

పుస్తక పఠనంపై అవగాహన ర్యాలీ



ర్యాలీలో రాష్ట్ర మంత్రులు ఎం.సుబ్రహ్మణ్యం, అన్బిల్ మహేష్, మేయర్ ప్రియ

ప్యారీస్, డిసెంబర్ 21 (ఆంధ్రజ్యోతి): పుస్తక పఠన ప్రాధాన్యంపై చెన్నైలో శనివారం నిర్వహించిన అవగాహన ర్యాలీలో రాష్ట్ర మంత్రులు ఎం.సుబ్రహ్మణ్యం, అన్బిల్ మహేష్, మేయర్ ప్రియ సహా సుమారు 500 మందికి పైగా విద్యార్థులు పాల్గొన్నారు. దక్షిణ భారత పుస్తక విక్రయదారులు, ప్రచురణకర్తల సంఘం ఆధ్వర్యంలో ఈనెల 27వ తేదీన 48వ పుస్తక ప్రదర్శనను ఉపముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్ ప్రారంభించనున్నారు. ఈ సందర్భంగా మంత్రి ఎం.సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ.. ఇలాంటి పుస్తక ర్యాలీ కార్యక్రమంలో పాలు పంచుకోవడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఈ నేపథ్యంలో పుస్తక పఠనంపై అవగాహన కల్పిస్తూ నందనం జంక్షన్ నుంచి వైఎంసీఏ గ్రౌండ్ వరకు సాగిన ర్యాలీకి విశేష స్పందన లభించింది.

నేడు డీఎంకే కార్యవర్గ సమావేశం

పెరంబూర్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): డీఎంకే కార్యవర్గ సమావేశం ఈనెల 22న ఆదివారం జరగనుంది. గతంలో ఈ సమావేశం నిర్వహిస్తున్నట్టు ప్రకటించిన నేపథ్యంలో, 'ఫెంగల్' తుపాను కారణంగా వాయిదా వేశారు. ఈ నేపథ్యంలో, స్థానిక తేనాంపేటలోని కలైంజర్ ఆడిటోరియంలో ఉదయం 10 గంటలకు పార్టీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ నేతృత్వంలో సమావేశం జరుగనుంది. ఈ సమావేశంలో కార్యవర్గ సభ్యులందరూ తప్పనిసరిగా పాల్గొనాలని పార్టీ ప్రధాన కార్యదర్శి దురైమురుగన్ ఒక ప్రకటనలో పిలుపుచ్చారు. ఈ మేరకు సమావేశంలో పాల్గొనాలని 400 మందికి ఆహ్వానాలు పంపినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.

డీఎంకే ఆధ్వర్యంలో సహాయాల పంపిణీ



పార్టీ నాయకులతో ఎమ్మెల్యే చంద్రన్

తిరుత్తణి, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): డీఎంకే పళ్లిపట్టు శాఖ ఆధ్వర్యంలో ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి జన్మదినం సందర్భంగా సహాయాల పంపిణీ జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తిరుత్తణి ఎమ్మెల్యే ఎస్.చంద్రన్ పాల్గొని, తొలుత పార్టీ జెండా ఎగురవేశారు. అనంతరం తలవాయి పట్టాడై పంచాయతీ యూనియన్ ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం విద్యార్థులకు విద్యా సామగ్రి, స్వీట్లు అందజేశారు. కార్యక్రమంలో పార్టీ నార్త్ యూనియన్ కార్యదర్శి సీజే శ్రీనివాసన్, పట్టణ కార్యదర్శి సెంధిల్‌కుమార్, 2వ వార్డు కౌన్సిలర్ డి.విజయ, 8వ వార్డు కౌన్సిలర్ కె.మురళి 13వ వార్డు కౌన్సిలర్ పి.చిరంజీవి, నిర్వాహకులు సి.సెంధిల్, ఓపీ ప్రదీస్, కేఎస్ మహ్మద్ అలి, కె.దివాకర్ తదితరులు పాల్గొన్నారు.

విజయవంతంగా హోమియోపతి సెమినార్



అతిథులను సత్కరిస్తున్న డాక్టర్ కొల్లిరాజు

అడయార్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): నగరంలోని శ్రీ వేంకటేశ్వర హోమియో వైద్య కాలేజీలో శుక్రవారం నిర్వహించిన 'హోమియోపతిక్ ఫిజీషియన్స్' సెమినార్ విజయవంతంగా ముగిసింది. చెన్నై తమిళనాడు విభాగం ఆధ్వర్యంలో స్థానిక పోరూర్‌లోని వేంకటేశ్వర హోమియోపతిక్ మెడికల్ కాలేజీ సహకారంతో వైద్య కాలేజీలోని ఆడిటోరియంలో ఆంకాలజీపై ఈ సెమినార్ జరిగింది. దీన్ని తమిళనాడు ప్రభుత్వ తమిళనాడు హోమియోపతిక్ మెడికల్ కౌన్సిల్ అధ్యక్షుడు డాక్టర్ ఎస్ఆర్ జయకుమార్ ప్రారంభించగా, ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హోమియోపతిక్ ఫిజీషియన్స్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ తన్వీర్ సయ్యద్ హుస్సేన్ కీలకోపన్యాసం చేశారు. ఆంకాలజీ చికిత్సా విధానంలో హోమియోపతి ఫిజీషియన్ల పాత్ర, ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హోమియోపతిక్ ఫిజీషియన్స్ సాధించిన ప్రగతిని ప్రధానంగా ప్రస్తావించారు. హెచ్ఆర్ఐడీ చెన్నై విభాగం, ఐఐహెచ్‌పీ చెన్నై, తమిళనాడు చీఫ్ కోఆర్డినేటర్, హోపతిక్ కన్సల్టెంట్ డాక్టర్ కొల్లి రాజు చేసిన ప్రసంగంలో క్లినికల్ ప్రాక్టీస్‌లో ఫార్మా కోవిజిలెన్స్ ప్రాధాన్యతను వివరించారు. అలాగే, ఐఐహెచ్‌పీ సౌత్ జోన్ జాతీయ ఉపాధ్యక్షుడు డాక్టర్ కేఎస్ఎస్ శివమూర్తి ఐఐహెచ్‌పీ చరిత్ర, కార్యకలాపాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఐఐహెచ్‌పీ పుదుచ్చేరి విభాగం అధ్యక్షుడు డాక్టర్ ఎం.ప్రకాశరావు, బాత్రాస్ ముంబై డైరెక్టర్లు మాజీ ప్రొఫెసర్ డాక్టర్ ఎం.ప్రకాశరావు, డాక్టర్ సమీర్ చక్కర్, తమిళనాడు హోమియోపతిక్ మెడికల్ కౌన్సిల్ తమిళనాడు చెన్నై విభాగం అధ్యక్షుడు డాక్టర్ ఎస్ఆర్ జయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఈవీకేఎస్ ఇళంగోవన్‌కు ఘన నివాళి



ఇళంగోవన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ ఎంపీ సుధా, శివరామన్ తదితరులు

ప్యారీస్, డిసెంబర్ 21 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు కాంగ్రెస్ కమిటీ (టీఎన్‌సీసీ) మాజీ అధ్యక్షుడు, ఈరోడ్ ఈస్ట్ ఎమ్మెల్యేగా వ్యవహరించి ఇటీవల మరణించిన ఈవీకేఎస్ ఇళంగోవన్ జయంతి సందర్భంగా కాంగ్రెస్ కార్యకర్తలు శనివారం సేవా కార్యక్రమాలు నిర్వహించారు. స్థానిక మనప్పాకంలో ఉన్న ఇళంగోవన్ నివాసంలో అలంకరించిన ఆయన చిత్రపటానికి కాంగ్రెస్ ఎంపీ సుధా పుష్పాంజలి ఘటించారు. టీఎన్‌సీసీ ఉపాధ్యక్షుడు పొన్ కృష్ణమూర్తి, అన్నానగర్ ఎమ్మార్ ఏలుమలై, శివరామన్, మాజీ కౌన్సిలర్ మణిపాల్, చూళై రాజేంద్రన్, లెనిన్‌కుమార్, సురేష్‌తో సహా కుటుంబ సభ్యులు నివాళులు అర్పించి అన్నదానం నిర్వహించారు. అలాగే ఇళంగోవన్ ఎమ్మెల్యేగా ప్రాతినిథ్యం వహించిన ఈరోడ్ ఈస్ట్ నియోజకవర్గ కార్యకర్తలు రక్తదానంతో పాటు అన్నదానం చేశారు.

చర్మ ఆరోగ్యం విలాసవంతం కాదు

● డాక్టర్ భైరవి సెంథిల్



చెన్నై, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): చర్మ ఆరోగ్యం విలాసవంతమైనది కాదని, ఇది మొత్తం శ్రేయస్సుకు సంబంధించిన ముఖ్యమైన భాగమని డాక్టర్ భైరవి సెంథిల్ పేర్కొన్నారు. స్థానిక ఆళ్వార్‌పేట, అంబుజవమ్మాళ్ రోడ్డులో ఏర్పాటైన 'డాక్టర్ బి 360 డెర్మటాలజీ ఎక్స్‌పీరియన్సిల్ సెంటర్'ను సీనియర్ ఐఏఎస్ అధికారి డాక్టర్ రాధాకృష్ణన్‌తో కలిసి డాక్టర్ భైరవి సెంథిల్, ప్రముఖ సామాజికవేత్త అప్సరా రెడ్డి, ఐటీ కమిషనర్ నందకుమార్ తదితరులు శుక్రవారం లాంఛనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అప్సర రెడ్డి మాట్లాడుతూ.. అందంపై అవగాహన తరచుగా అవకాశాలను, ఆత్మగౌరవాన్ని రూపొందిస్తున్న యుగంలో 'లక్స్ ఎకానమీ' మన జీవితంలో ఒక ముఖ్యమైన అంశంగా మారిందని వ్యాఖ్యానించారు.

ఉద్యోగం పేరుతో రూ.34 లక్షల మోసం

● దంపతుల అరెస్ట్

ప్యారీస్, డిసెంబర్ 21 (ఆంధ్రజ్యోతి): న్యాయస్థానంలో ఉద్యోగాలిప్పిస్తామని నమ్మించి పలువురి వద్ద రూ. 34 లక్షలు మోసం చేసిన భార్యాభర్తలను ఆర్థిక నేర విభాగం పోలీసులు అరెస్టు చేశారు. పూందమల్లికి చెందిన కారు డ్రైవర్ రాజేష్‌కు 2020వ సంవత్సరం అదే ప్రాంతానికి చెందిన గణపతి, అతని భార్య రాధికతో పరిచయమైంది. ఈ క్రమంలో మద్రాసు హైకోర్టులో ప్యూన్ ఉద్యోగం ఇప్పిస్తామని ఆ దంపతులు చెప్పడంతో నమ్మిన రాజేష్ తన బ్యాంకు ఖాతా నుంచి రాధిక బ్యాంకు ఖాతాకు రూ.17లక్షలు ట్రాన్స్‌ఫర్ చేశాడు. అదేవిధంగా పూందమల్లి లోటస్ అపార్ట్‌మెంట్ సమీపంలో నివసిస్తున్న సురేష్, విజయన్ అనే అన్నదమ్ములకు కూడా హైకోర్ట్‌లో గుమస్తా ఉద్యోగాలిప్పిస్తామని నమ్మబలికి వారి నుంచి రూ.17.75లక్షలు నగదు తీసుకున్నారు. దీనిపై వారు ముగ్గురు ఆర్థికనేర విభాగం కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. ఈమేరకు కేసు నమోదు చేసి రాధిక, గణపతిని అరెస్టు చేసి శుక్రవారం న్యాయస్థానంలో హాజరుపరచి పుళల్ జైలుకి తరలించారు.

క్రిస్మస్, న్యూ ఇయర్ ప్రత్యేక రైళ్లు

పెరంబూర్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): క్రిస్మస్, న్యూ ఇయర్ సందర్భంగా ప్రయాణికుల సౌకర్యార్థం ప్రత్యేక రైళ్లు నడుపనున్నట్లు దక్షిణ రైల్వే తెలిపింది.

● నెం.06039 తాంబరం - కన్నియాకుమారి ప్రత్యేక సూపర్‌ఫాస్ట్ రైలు ఈనెల 24, 31 తేదీల్లో తాంబరం నుంచి అర్ధరాత్రి 12.35 గంటలకు బయల్దేరి మరుసటిరోజు మధ్యాహ్నం 12.15 గంటలకు కన్నియాకుమారి చేరుకుంటుంది. మరోమార్గంలో నెం.06040 కన్నియాకుమారి - తాంబరం ప్రత్యేక సూపర్‌ఫాస్ట్ రైలు ఈనెల 25, జనవరి 1 తేదీల్లో కన్నియాకుమారి నుంచి సాయంత్రం 4.30 గంటలకు బయల్దేరి మరుసటిరోజు ఉదయం 4.20 గంటలకు తాంబరం చేరుకుంటుంది.

● నెం.06043 ఎంజీఆర్ చెన్నై - కొచ్చువెలి వారాంతపు రైలు ఈ నెల 23, 30 తేదీల్లో ఎంజీఆర్ చెన్నై సెంట్రల్ నుంచి రాత్రి 11.20 గంటలకు బయల్దేరి మరుసటిరోజు సాయంత్రం 6.05 గంటలకు కొచ్చువెలి చేరుకుంటుంది. మరోమార్గంలో నెం.06044 కొచ్చువెలి - ఎంజీఆర్ చెన్నై సెంట్రల్ వారాంతపు ప్రత్యేక రైలు ఈ నెల 24, 31 తేదీల్లో కొచ్చువెలి నుంచి రాత్రి 8.20 గంటలకు బయల్దేరి మరుసటిరోజు మధ్యాహ్నం 2 గంటలకు ఎంజీఆర్ చెన్నై సెంట్రల్ చేరుకుంటుంది. ఈ రైళ్ల రిజర్వేషన్ ప్రారంభమైందని అధికారులు తెలిపారు.

కుంభమేళాకు...

● నెం.06005 కన్నియాకుమారి - గయ ప్రత్యేక రైలు జనవరి 6, 20 తేదీల్లో (సోమవారం) కన్నియాకుమారి నుంచి రాత్రి 8.30 గంటలకు బయల్దేరి నాల్గో రోజు వేకువజామున 1.30 గంటలకు గయ చేరుకుంటుంది. మరోమార్గంలో నెం.06006 గయ - కన్నియాకుమారి ప్రత్యేక రైలు జనవరి 9, 23 తేదీల్లో (గురువారం) గయ నుంచి వేకువజామున 3.50 గంటలకు బయల్దేరి నాల్గో రోజు వేకువజామున 3.50 గంటలకు కన్నియాకుమారి చేరుకుంటుంది. ఈ రైళ్లు చెంగల్పట్టు, తాంబరం, చెన్నై ఎగ్మూర్, గూడూరు, నెల్లూరు మార్గంగా వెళ్లనున్నాయి.

కుమారుడిని హతమార్చిన తండ్రి సహా ఇద్దరి అరెస్ట్

పెరంబూర్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో రోజూ ఆగడాలకు పాల్పడుతున్న కుమారుడిని హతమార్చిన కేసులో తండ్రి, బంధువును పోలీసులు అరెస్ట్ చేశారు. కాంచీపురం జిల్లా పుదుపాక్కంలో ఉన్న కొలనులో తల మాత్రమే బయటకు కనిపించిన మృతదేహాన్ని చూసి భయాందోళనలు చెందిన స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు అక్కడకు చేరుకొని, మృతదేహాన్ని వెలికితీసి, అది 35 ఏళ్ల యువకుడిదిగా గుర్తించారు. ఈ వ్యవహారంపై పోలీసులు మూడు ప్రత్యేక బృందాలు ఏర్పాటుచేసి విచారణలో... మృతుడు అదే గ్రామానికి చెందిన కార్తవరాయన్ కుమారుడు మునుస్వామి(40)గా గుర్తించారు. మునుస్వామికి వివాహమై ఇద్దరు పిల్లలున్నారు. మద్యానికి బానిసైన మునుస్వామి రోజూ తాగి ఇంటికి వచ్చి ఘర్షణలకు పాల్పడుతుండడంతో, ఆయన భార్య ఇద్దరు పిల్లలను తీసుకుని పుట్టింటికి వెళ్లింది. ఈ క్రమంలో, ఘటన జరిగిన రోజు మద్యం తాగి వచ్చిన మునుస్వామి తల్లిదండ్రులపై దాడి చేసినట్లు సమాచారం. ఆగ్రహించిన తండ్రి కార్తవరాయన్ కర్రతో మునుస్వామిపై దాడిచేయగా అతను అక్కడికక్కడే మృతిచెందాడు. ఊహించని ఘటనకు దిగ్భ్రాంతి చెందిన కార్తవరాయన్, తన బంధువు రాజేష్ సహాయంతో మునుస్వామి మృతదేహాన్ని కొలనులో వేసినట్లు విచారణలో తెలిసింది. దీంతో, కార్తవరాయన్, రాజేష్‌ను అరెస్ట్ చేసిన పోలీసులు, వారిని కోర్టులో హాజరుపరచి జైలుకు తరలించారు.

వైద్యుడి ఇంట్లో చోరీ

దంపతుల అరెస్ట్

వేలూరు, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): వైద్యుడి ఇంట్లో చోరీకి పాల్పడిన దంపతులను పోలీసులు అరెస్ట్ చేశారు. తిరుపత్తూర్ రామనాథనగర్‌కు చెందిన కలైసెల్వన్ తిరుపత్తూర్ ప్రభుత్వ ఆస్పత్రి, ఆయన భార్య కలైసెల్వి పుదూర్‌నాడు ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యులు. ఈ క్రమంలో, రెండు నెలల క్రితం తిరుపత్తూర్ సమీపం పుదుపేట అగ్రహారానికి చెందిన మల్లిక వైద్యుల ఇంట్లో పనిమనిషిగా చేరింది. కొద్దిరోజుల క్రితం మల్లిక మరో వైద్యురాలు శంకరి ఇంట్లో పని చేసినట్లు, ఆ సమయంలో బీరువాలో ఉంచిన 25 సవర్ల నగలు అదృశ్యం కావడం గమనించింది. దీంతో శంకరి తిరుపత్తూర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ వ్యవహారంలో మల్లికను అనుమానించిన పోలీసులు, ఆమెను అదుపులోకి తీసుకొని విచారించారు. తన భర్త సహకారంతో నగలు చోరీ చేసినట్లు మల్లిక అంగీకరించింది. ఈక్రమంలో మల్లిక, ఆమె భర్తను అరెస్ట్ చేసిన పోలీసులు, తిరుపత్తూర్ కోర్టులో హాజరు పరచి జైలుకు తరలించారు.

గంజాయి మత్తులో దాడి

ముగ్గురి అరెస్ట్

ఐసిఎఫ్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక అంబత్తూర్ ఇండస్ట్రియల్ ఎస్టేట్ ప్రాంతంలో గురువారం రాత్రి 10 గంటలకు స్థానికులపై గంజాయి మత్తులో ముగ్గురు యువకులు దాడి చేసి గాయపరిచారు. అంబత్తూర్ ఇండస్ట్రియల్ ఎస్టేట్ బస్టాండ్‌లో గంజాయి మత్తులో యువకులు కాలినడకన వెళ్తున్న స్థానికులను కత్తులతో బెదిరించి భయభ్రాంతులకు గురిచేశారు. నోటికొచ్చినట్లు అక్కడున్న వారిని దుర్భాషలాడారు. అదేమని ప్రశ్నించిన వారిపై దాడిచేసి పరారయ్యారు. ఈ ఘటనపై స్థానికులు అంబత్తూర్ ఇండస్ట్రియల్ ఎస్టేట్ పోలీసులకు ఫిర్యాదు చేయగా, ఘటనా స్థలానికి చేరుకుని తీవ్రంగా గాయపడిన తిరువళ్లూర్ జిల్లా తిరువలాంగాడు చెందిన నవీన్, పాడికి చెందిన డ్రైవర్ హసన్ మొహిద్దీన్, అంబత్తూర్‌కు చెందిన ధనశేఖర్, ఉత్తరాదికి చెందిన మహేంద్రకుమార్, దీపక్‌ను స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ దారుణానికి పాల్పడింది మంగళాపురానికి చెందిన నితివేల్, మన్నూర్‌పేటకు చెందిన లక్కీ లోకేష్, తిరువేర్కాడు అయ్యపాక్కానికి చెందిన మణికంఠన్‌గా గుర్తించారు. ముగ్గుర్ని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచి జైలుకు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

పూందమల్లి జైలు నుంచి ఖైదీల తరలింపు

పెరంబూర్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): పూందమల్లి కరయాన్‌చావిడిలో ఉన్న శాఖా జైలులో పలు కేసులతో సంబంధాలున్న 46 మంది ఖైదీలు బంధీలుగా ఉన్నారు. జైళ్ల శాఖ ఉన్నతాధికారులు ఈనెల 11న జైలులో ఆకస్మిక తనిఖీలు చేపట్టి, ఖైదీల గదుల నుంచి ఐదు మొబైల్ ఫోన్లు, 20 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. జైలు సిబ్బంది సహకారంతో ఖైదీలు గంజాయి సేవిస్తున్నారని విచారణలో తెలిసింది. ఈ వ్యవహారంలో పూందమల్లి శాఖా జైలు సబ్ జైలర్, డిప్యూటీ జైలర్, హెడ్ కానిస్టేబుల్ సహా 11 మందిని సస్పెండ్ చేశారు. ఈ క్రమంలో, బీఎస్పీ అధ్యక్షుడు ఆమ్‌స్ట్రాంగ్ హత్యకేసులో అరెస్టయి పూందమల్లి సబ్ జైలులో ఉన్న అశ్వత్థామన్ సహా 23 మంది, ఇతర కేసులతో సంబంధాలున్న 15 మంది అని మొత్తం 38 మందిని ఈ నెల 14న పుళల్ జైలుకు తరలించారు. అలాగే, ముగ్గురు ఖైదీలను కోవై, కడలూరు, పుళల్ జైళ్లకు తలా ఒకరు, వేలూరుకు ఒక ఖైదీని శుక్రవారం తరలించారు. ఖైదీలందరినీ ఇతర జైళ్లకు తరలించడంతో, పూందమల్లి సబ్ జైలు ఖాళీ అయ్యింది.

చెరువులోకి దూసుకెళ్లిన బైక్

ప్రేమజంట సహా ముగ్గురి మృతి

ప్యారీస్, డిసెంబర్ 21 (ఆంధ్రజ్యోతి): తిరుప్పూర్ జిల్లా ఉడుమలై సమీపంలోని చెరువులో పాఠశాల విద్యార్థిని, ఇద్దరు యువకులు శుక్రవారం ఉదయం విగతజీవులుగా కనిపించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసుల విచారణలో బాలికకు ఇన్‌స్టాగ్రాం ద్వారా యువకుడి(20)తో పరిచయం ఏర్పడింది. ఆ పరిచయం కాస్త ప్రేమగా మారడంతో ఆ యువకుడు తరచూ కురుచ్చికోటకు వెళ్లి ఆమెను కలుసుకునేవాడు. వీరి ప్రేమకు మరో విద్యార్థి(21) అన్ని విధాలా సహకరించేవాడు. ఈనెల 18న ఆ బాలిక పుట్టినరోజు కావడంతో ప్రేమికుడు కురుచ్చికోటకు వెళ్లి యువకుడిని వెంటబెట్టుకుని ఆమెను కలుసుకున్నాడు. ముగ్గురూ బైకుపై మానుపట్టికి వెళ్లి కేక్ కటింగ్ చేసి బాలిక పుట్టినరోజు వేడుకలను అట్టహాసంగా జరుపుకున్నారు. రాత్రి విందు భోజనాలు కూడా ఆరగించారు. ఆ తర్వాత కురిచ్చికోటకు ముగ్గురూ ఒకే బైకుపై తిరిగొస్తుండగా మార్గమధ్యంలో బైకు అదుపు తప్పి రహదారి పక్కనున్న కొలనులో దూసుకెళ్లింది. ఆ కొలను లోతుగా ఉండటంతో ముగ్గురూ నీట మునిగి దుర్మరణం చెందారు. ఈలోగా బాలిక కోసం ఆమె తల్లిదండ్రులు, యువకుడి కోసం అతడి తల్లిదండ్రులు వెదుకుతూ పోలీసులకు ఫిర్యాదు కూడా చేశారు. ఆ నేపథ్యంలో శనివారం ఉదయం ఆ కొలనులో ముగ్గురి మృతదేహాలు తేలాయి. సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాలను వెలికి తీసి పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి పంపారు.

విధుల కంటే సెల్‌ఫోన్లలో మునుగుతున్నారు!

● పోలీసుల తీరుపై హైకోర్టు ఆవేదన

వాషర్‌మెన్‌పేట, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో పోలీసులు సెల్‌ఫోన్లు అధికంగా వినియోగించడం శోచనీయమని మద్రాసు హైకోర్టు ఆవేదన వ్యక్తం చేసింది. తిరునల్వేలి కోర్టు ప్రాంగణంలో శుక్రవారం దారుణహత్యకు గురైన ఘటనను హైకోర్టు సుమోటో కేసుగా విచారించింది. ఈ కేసు శనివారం విచారణకు రాగా హైకోర్టు.. పోలీసులు విధుల కంటే సెల్‌ఫోన్లు అధికంగా వినియోగిస్తున్నారని అభిప్రాయం వ్యక్తం చేసింది. తిరునల్వేలి హత్య వ్యవహారంలో అక్కడ భద్రతా విధుల్లో పోలీసులను విచారించాలని జిల్లా ఎస్పీకి హైకోర్టు ఉత్తర్వులు జారీచేసింది. అలాగే, హంతకులను పట్టుకున్న ప్రత్యేక ఎస్ఐ కొండాస్‌కు అభినందించిన హైకోర్టు, అతనికి రివార్డు అందించాలని సిఫారసు చేసింది.

చెన్నైలో ల్యాండ్ అయిన హైదరాబాద్ విమానం

వాషర్‌మెన్‌పేట, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): వాతావరణం అనుకూలించక పోవడంతో హైదరాబాద్‌లో ల్యాండింగ్ కావాల్సిన ఇండిగో విమానాన్ని చెన్నైకి మళ్లించారు. సౌదీ అరేబియా దమ్మామ్ నగరం నుంచి 178 మంది ప్రయాణికులతో బయల్దేరిన విమానం శనివారం ఉదయం 8 గంటలకు హైదరాబాద్ చేరుకోవాల్సి ఉంది. ఆ సమయంలో హైదరాబాద్ విమానాశ్రయంలో ల్యాండింగ్‌కు వాతావరణం అనుకూలించకపోవడంతో ఆ విమానాన్ని చెన్నైకి పంపించారు.. ప్రయాణికులకు విమానాశ్రయంలో విశ్రాంతి కల్పించిన అధికారులు, హైదరాబాద్‌లో వాతావరణం అనుకూలించడంతో చెన్నై నుంచి బయల్దేరి వెళ్లింది.

నగర జలాశయాల్లో 79 శాతం నీటినిల్వలు

పెరంబూర్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): చెన్నైకి తాగునీరు అందించే జలాశయాల్లో 79.17 శాతం నీటినిల్వలున్నాయి. పూండి, పుళల్, చెంబరంబాక్కం, చోళవరం, కన్నన్‌కోట తేర్వాయ్ కండిగై తదితర ఐదు జలాశయాల నుంచి నగరానికి తాగునీరు సరఫరా అవుతున్నాయి. ఈ ఐదు జలాశయాల పూర్తి సామర్థ్యం 11.757 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 9.308 టీఎంసీల నీటినిల్వలున్నాయి. చెంబరంబాక్కం జలాశయంలో 82 శాతం, పుళల్‌లో 83.3 శాతం, పూండిలో 87.37 శాతం, చోళవరంలో 28.86 శాతం, కన్నన్‌కోట తేర్వాయ్‌కండిగై జలాశయంలో 87 శాతం నీటి నిల్వలున్నాయని ప్రజాపనుల శాఖ అధికారులు తెలిపారు.

ముందస్తు వైద్య పరీక్షలతోనే క్యాన్సర్‌కు చెక్

SUNDAY SPECIAL



క్యాన్సర్‌కు సరైన మందును కనుగొన్నట్టు రష్యా ప్రభుత్వం చేసిన ప్రకటన బాధితుల్లో జీవితంపై ఆశలు చిగురించేలా చేసిందని, రోగం ముదిరిన తర్వాత వైద్యులను సంప్రదించడం కంటే ముందస్తు పరీక్షలు జరుపుకుంటే ఆ మహమ్మారి బారిన పడకుండా ఉండవచ్చని అరుంబాక్కంలోని ప్రభుత్వ యోగా నేచురోపతి వైద్య కళాశాల ఆస్పత్రి వైద్యనిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఆ ఆస్పత్రి పీజీ బ్లాక్ క్యాంపస్‌లో నిర్వహించిన వక్షోజ, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ సమగ్ర అవగాహన నిర్ధారణ శిబిరంలో నగరం నలుమూలల నుంచి వచ్చిన సుమారు 100 మంది మహిళలకు ఉచిత వైద్యపరీక్షలు నిర్వహించారు. రోటరీ క్లబ్ ఆఫ్ చెన్నై, శ్రీరామచంద్రా వైద్య విశ్వవిద్యాలయం సంయుక్త సహకారంతో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. నగరవాసుల నుంచి అపూర్వ స్పందన లభించింది. మహిళలంతా వైద్యపరీక్షలు జరుపుకునేందుకు, వైద్యనిపుణులు తెలిపిన ఆహార నియమాలు గురించి తెలుసుకునేందుకు ఉత్సాహం కనబరిచారు.

- ఆంధ్రజ్యోతి, చెన్నై









క్యాన్సర్ రోగులకు శక్తినిచ్చే వంటకాలు - ప్రకృతి సిద్ధమైన వంటకాలను తయారు చేస్తున్న మహిళలు - ప్రకృతి సిద్ధమైన ఆహారం గురించి వివరిస్తున్న వైద్యురాలు - కంటిపరీక్షలు చేస్తున్న వైద్యనిపుణులు



మహిళకు వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్

ముందస్తు వైద్య పరీక్షలు

వక్షోజ పరీక్షలు, ఎక్స్‌రే, మామోగ్రామ్ తదితర క్యాన్సర్ ముందస్తు వైద్యపరీక్షలు చేయించుకున్నారు. వీరందరికీ వైద్యనిపుణులు వక్షోజ, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నిరోధానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి కూడా కౌన్సెలింగ్ ఇచ్చారు. క్యాన్సర్‌ను ప్రాథమిక స్థాయిలో గుర్తించటం, క్రమబద్ధంగా వైద్యపరీక్షలు చేసుకోవడం తదితర విషయాలపై క్యాన్సర్‌కు చికిత్సలందించే వైద్యులు సలహాలు, సూచనలందించారు. మహిళలు తమ వక్షోజాలను స్వీయపరీక్షలు చేసుకునే విధానాన్ని కూడా వివరించారు. ఇక ప్రభుత్వ యోగా నేచురోపతి వైద్యకళాశాలకు చెందిన విద్యార్థులు వక్షోజ క్యాన్సర్, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌పై అవగాహన కల్పించేలా నిర్వహించిన మైమ్ ప్రదర్శనలు (మూకాభినయాలు) మహిళలను మరింతగా ఆకట్టుకున్నాయి.

ప్రకృతి సిద్ధమైన వంటకాలు...

వైద్యపరీక్షలు చేసుకున్న మహిళలందరికీ క్యాన్సర్ నిరోధానికి, క్యాన్సర్ రోగులకు దోహదం చేసే ప్రకృతిసిద్ధమైన వంటకాలను తయారు చేసి అందజేశారు. నువ్వుల ఉండలు, బొప్పాయి, బీట్‌రూట్, క్యారెట్ ముక్కలు ఉడికిన గుగ్గుళ్లు, నాటుబియ్యంతో తయారైన అన్నం అంటూ వివిధ రకాల వంటకాలను మహిళలందరికీ వడ్డించారు. ఇళ్లలో వీలును బట్టి క్యాన్సర్ నిరోధానికి దోహదపడే ఈ ప్రకృతి సిద్ధమైన వంటకాలను తయారు చేసే విధానాలను కూడా వైద్య కళాశాల విద్యార్థినులు అవగాహన కల్పించారు. మొత్తానికి ఈ శిబిరం వక్షోజ క్యాన్సర్‌పై ఉన్న అపోహలను పోగొట్టిందని వైద్యపరీక్షలు చేసుకున్న మహిళలు తెలిపారు. ఈ శిబిరంలో రోటరీక్లబ్ ఆఫ్ చెన్నై ప్రతినిధులు, శ్రీరామచంద్ర వైద్యకళాశాల ఉద్యోగులు, హెల్త్ వలంటీర్లు, వైద్యులు పాల్గొని క్యాన్సర్ పరీక్షలకు ఉపయోగించే సాంకేతిక పరికరాలను ఉపయోగించి మహిళలకు వైద్యపరీక్షలు జరిపి, వారికి మెడికల్ రిపోర్ట్‌లను కూడా అందజేశారు.



మూకాభినయం చేస్తున్న విద్యార్థులు



సముద్రగని - అమీర్ మాటామంతి

ఏడేళ్ల తర్వాత ఓ మంచి చిత్రంలో నటించా

● సముద్రఖని

ఏడు సంవత్సరాల తర్వాత ఒక మంచి చిత్రంలో నటించానని దర్శక, నటుడు సముద్రఖని అన్నారు. నందా పెరియస్వామి దర్శకత్వంలో సముద్రఖని నటించిన చిత్రం 'తిరు మాణిక్యం'. ముఖ్య పాత్రల్లో దర్శక దిగ్గజం భారతీరాజా, సీనియర్ నటుడు నాజర్ నటించారు. అనన్య, తంబి రామయ్య, వడివుక్కరసి, ఇళవరసు, చిన్ని జయంత్, శామ్స్ శ్రీమన్, కరుణాకరన్, చంద్రు తదితర తారాగణం ఇతర పాత్రలను పోషించారు. విశాల్ చంద్రశేఖర్ సంగీత స్వరాలు సమకూర్చగా సుకుమార్ ఛాయాగ్రహణం అందించారు. ఈ నెల 27న విడుదలకానుంది. తాజాగా ఈ చిత్ర బృందం విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేసింది. ఇందులో హీరో సముద్రఖని మాట్లాడుతూ... 'ప్రతి ఒక్కరూ చిత్ర విజయం కోసం వేర్వేరుగా శ్రమించడం లేదు. ప్రతి ఒక్కరూ తాము నటించే అన్ని చిత్రాల సక్సెస్‌కు ఒకే విధంగానే కష్టపడుతున్నారు. 'పరుత్తివీరన్', 'సుబ్రమణియపురం'లాంటి సక్సెస్‌లను అధికమించేందుకు అహర్నిశలు శ్రమిస్తున్నాం. 'అప్పా' అనే చిత్రం తర్వాత అంటే ఏడేళ్లకు ఒక మంచి చిత్రంలో నటించే అవకాశం లభించింది. ఇందులో ఒక మంచి మనిషిగా నటించాను. కొన్ని చిత్రాలకు మాత్రమే అన్ని అనుకూలంగా సమకూరుతాయి. నిజం చెప్పడమే సత్యం. గతంలో చెడ్డ వ్యక్తితో స్నేహం చేయొద్దని పెద్దలు చెప్పేవారు. ఇపుడు మంచి వ్యక్తిని చూసి అలా చెబుతున్నారు. ఈ స్టోరీ వినగానే నటిస్తానని చెప్పాను. హీరోయిన్ అనన్య నేను పరిచయం చేసిన అమ్మాయే. భారతిరాజాతో కలిసి ఐదు రోజులు ప్రయాణించడం ఒక వరంలా భావిస్తున్నా. ఈ సినిమా ప్రతి సాధారణ పౌరుడి మనసుకు దగ్గరగా ఉంటుంది' అన్నారు.

మనసు విప్పి మాట్లాడుకోండి

● జయం రవి దంపతులకు కోర్టు సూచన

విడాకుల కోసం సినీ హీరో జయం రవి దంపతులు ఇటీవల కోర్టును ఆశ్రయించారు. వీరికి మద్రాస్ కుటుంబ సంక్షేమ కోర్టు సూచన చేసింది. మనసు విప్పి మాట్లాడుకోవాలని సూచించింది. ఈ దంపతుల మధ్య తలెత్తిన మనస్పర్థల కారణంగా విడాకులు కోరుతూ కోర్టును ఆశ్రయించిన విషయం తెల్సిందే. అయితే, ఈ విడాకుల నిర్ణయం తనకు తెలియకుండా తీసుకున్నారంటూ జయం రవి భార్య ఆర్తి ప్రకటించారు. పైగా తన భర్తతో కలిసి జీవించేందుకు ఇష్టపడుతున్నట్టు బహిరంగ ప్రకటన విడుదల చేశారు. దీన్ని జయం రవి సమ్మతించకపోగా, విడాకులు మంజూరు చేయాలని కోరుతూ చెన్నై ఫ్యామిలీ వెల్ఫేర్ కోర్టును ఆశ్రయించి, ఈ కేసు తొలి విచారణ సందర్భంగా కోర్టుకు స్వయంగా హాజరయ్యారు. ఈ నేపథ్యంలో ఈ కేసుపై విచారణ మరోమారు జరిగింది. ఆ సమయంలో మనసు విప్పి మాట్లాడుకోవాలంటూ జయం రవి దంపతులకు కోర్టు సూచించడంతో వారిద్దరూ కౌన్సెలింగ్ హాలులో గంటకుపైగా మాట్లాడుకున్నారు. అయినప్పటికీ ఏకాభిప్రాయానికి రాలేకపోయారు. దీంతో ఈ కేసు తదుపరి విచారణను కోర్టు జనవరి 8వ తేదీకి వాయిదా వేసింది.



జయం రవి - ఆర్తి రవి

ఆ వ్యాఖ్యలను ఖండిస్తున్నా : వెట్రిమారన్



భారత రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌ను ఉద్దేశించి కేంద్ర హోం మంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలు ఖండించదగినవని సినీ దర్శకుడు వెట్రిమారన్ అన్నారు. తాను దర్శకత్వం వహించిన 'విడుదలై-2' చిత్రం శుక్రవారం విడుదలకాగా, ప్రేక్షకులతో కలిసి సినిమాను చూశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ... 'అభిమానులతో కలిసి పది నిమిషాలు చిత్రాన్ని చూశా. సినిమా ఎలా ఉందనేది వారే చెప్పాలి. అంబేడ్కర్‌ను ఉద్దేశించి అమిత్ షా చేసిన వ్యాఖ్యలు ఆమోదయోగ్యమైనవి కావు. ఖండించదగినవి' అని పేర్కొన్నారు. కాగా, ఇటీవల రాజ్యసభలో అమిత్‌షా మాట్లాడుతూ, 'ప్రతి ఒక్కరూ అంబేడ్కర్ పేరును వాడుకోవడం ఇపుడు ఓ ఫ్యాషన్‌గా మారిపోయింది. అంబేడ్కర్ పేరును పదేపదే జపిస్తున్నారు. ఆ పేరుకు బదులు దేవుడి పేరును జపిస్తే ఏడో జన్మకైనా స్వర్గంలో చోటు లభిస్తుంది' అంటూ వ్యాఖ్యానించారు. ఇవి దేశంలో పెను వివాదం, చర్చకు దారితీశాయి.

'విడుదలై-2'లో నటించడం మహాభాగ్యం

చిత్రజ్యోతి

● మంజు వారియర్

మెరుగైన సమాజం, ప్రతి ఒక్కరికీ సమాన అవకాశాలు ఉండాలని కోరుతూ ఎంతో మంది నేతలు తమవంతుగా సమాజసేవకు అంకితమైవున్నారని, అలాంటి ప్రజా నేత స్టోరీనే 'విడుదలై-2' అని, ఇలాంటి చిత్రంలో నటించడం మహాభాగ్యంగా భావిస్తున్నట్టు ఆ చిత్ర హీరోయిన్ మంజు వారియర్ అన్నారు. వెట్రిమారన్ దర్శకత్వంలో సూరి, విజయ్ సేతుపతి, మంజు వారియర్ నటించిన ఈ చిత్రం శుక్రవారం తమిళం, తెలుగు బాషల్లో విడుదలైంది. ఈ సినిమా గురించి మంజు వారియర్ మాట్లాడుతూ.. "అసురన్' సినిమా తర్వాత వెట్రిమారన్ దర్శకత్వంలో నటించే అవకాశం ఎపుడు వస్తుందా అని వెయ్యికళ్లతో ఎదురు చూశా. అవకాశం వస్తే అన్నింటినీ పక్కనబెట్టి నటించాలని నిర్ణయం తీసుకున్నా. ఆ అవకాశం ఓ రోజున రానేవచ్చింది. కథ చెప్పేందుకు దర్శకుడు ప్రయత్నించగా, అవేమీ వద్దనీ, షూటింగ్‌కు ఎప్పుడు రావాలని మాత్రమే చెప్పాలని కోరా. అలా 'విడుదలై-2'లో నా ప్రయాణం మొదలైంది. విజయ్ సేతుపతితో నటించే అవకాశం మూడు సార్లు కోల్పోయా. ఆయన ఓ రియల్ హీరో. లోకేషన్‌లో ఆయన నటను చూసి ఆశ్చర్యపోయా. సినిమాలో దర్శకుడు చెప్పదలచుకున్న మెసేజ్, రాజకీయాలు మనకు తెలిసినవే. నిజం చెప్పాలంటే విజయ్ సేతుపతి కథ, ఆయన జీవితం ఎలా ప్రారంభమైంది. వాత్తియార్ (టీచరు)గా ఎలా మారారు. ఆయన అర్థం చేసుకున్న విషయాలు ఏంటి? అనే విషయాలు తొలి భాగంలో చూసిన వాటికి కొనసాగింపే ఈ చిత్రం. ప్రజలతో కలిసిపోయి శ్రమించే నాయకుడి కథే ఇది. వెలుగులోకి రాని ఇలాంటి అనేక మంది ప్రజా నేతల స్టోరీ. మనం ఊహించని అనేక విషయాలు ఆలోచించేలా చేస్తుంది. అనేక సన్నివేశాలు మన జీవన ప్రయాణాన్ని ప్రశ్నించేలా చేస్తాయి. ఇలాంటి చిత్రంలో నటించడం భాగ్యంగా భావిస్తున్నా' అని పేర్కొన్నారు.



రాజరాజచోళుడి స్మారక మండపానికి

రూ.3.5. కోట్లతో సొబగులు

టి.నగర్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): చోళ చక్రవర్తి రాజరాజచోళుడు కీర్తిని చాటే బృహదీశ్వరాలయ క్షేత్రాన్ని తలపించే రీతిలో నిర్మితమైన రాజరాజచోళన్ స్మారక మండపం కొత్త సొబగులతో పునఃప్రారంభానికి సిద్ధంగా ఉంది. ప్రజాపనుల శాఖ ఆధ్వర్యంలో ఈ స్మారక మండపాన్ని రూ 3.5 కోట్లతో పునర్నిర్మించారు. తంజావూరులో 1995లో 8వ ప్రపంచ తమిళ మహానాడు నిర్వహించారు. అప్పటి ముఖ్యమంత్రి జయలలిత ఉత్తర్వుల మేరకు చోళ చక్రవర్తులను భావితరాలు స్మరించుకునేలా తంజావూరు - పుదుకోట రహదారిలో 3.23 ఎకరాల్లో రూ.1.60 కోట్లతో రాజరాజచోళన్ స్మారక మండపం నిర్మితమైంది. ఈ మండపానికి తరచూ మరమ్మతులు చేపట్టినా మండపం నిర్మించి సుమారు మూడు దశాబ్దాలు కావస్తుండటంతో కళా విహీనమైంది. ఆ స్మారక మండపానికి మరమ్మతులు చేపట్టాలని తమిళ చరిత్రకారులు, స్థానికులు, సంఘసేవకులు, సాహితీవేత్తలు పలుమార్లు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. దీంతో ఆ మండపాన్ని సర్వాంగ సుందరంగా తీర్చేదిశగా మరమ్మతులు చేపట్టేందుకు డీఎంకే ప్రభుత్వం రూ.3.5 కోట్లు కేటాయించింది. గత యేడాది అక్టోబర్ నుంచి ఆ స్మారక మండపం మరమ్మతులు ప్రారంభమయ్యాయి. ప్రస్తుతం మరమ్మతులన్నీ పూర్తికావడంతో రాజరాజచోళన్ స్మారక మండపం ఆ చక్రవర్తిలాగే గాంభీర్యాన్ని చాటుతోంది. కొత్త అందాలతో మెరిసిపోతున్న ఈ భవనాన్ని త్వరలోనే ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రారంభించనున్నారు. ప్రస్తుతం ఈ స్మారక మండపంలో పచ్చిక బయళ్లు ఏర్పాటు చేశారు. చిన్నారుల కోసం క్రీడా ఉపకరణాలు, ఫౌంటేన్, చిన్నారుల రైలు, ఊయలలు, రాజరాజన్ మ్యూజియం ఉన్నాయి. 78 అడుగుల ఎత్తు కలిగిన ఈ స్మారక మండప శిఖరాగ్రంలో సందర్శకులు నిలిస్తే తంజావూరు నగరంలోని బృహదీశ్వరాలయం, సముత్తిరం చెరువు సహా అన్ని ప్రాంతాలు రమ్యంగా కనిపిస్తాయి. ఈ విషయమై పర్యాటకశాఖ అధికారి ఒకరు మాట్లాడుతూ... చోళ చక్రవర్తుల కాలం నాటి చరిత్రను భావితరాలకు అందించేలా తంజావూరు అంతఃపుర ప్రాంగణంలో 1884 నుంచి చోళర్ మ్యూజియం పర్యాటకులకు ప్రత్యేక ఆకర్షణగా ఉంటోంది. 1995 నుంచి ఆ మ్యూజియంను ఇక్కడి రాజరాజచోళన్ స్మారక మండపానికి తరలించినట్లు తెలిపారు. చోళరాజుల కాలం నాటి శిలాశాసనాలు, శిల్పాలు, లోహాలతో తయారైన పూజా సామగ్రి, కళాత్మక వస్తువులు, చోళుల కాలానికి చెందిన చిన్న చిన్న విగ్రహాలున్నాయి. ప్రస్తుతం కొత్త సాంకేతిక పరిజ్ఞానంతో ఈ మ్యూజియాన్ని అభివృద్ధి చేసినట్లు తెలిపారు. ఈ స్మారక మండపం ప్రారంభమైతే తంజావూరు నగరానికి విచ్చేసే పర్యాటకుల సంఖ్య మరింతగా పెరిగే అవకాశాలు ఉన్నాయని ఆయన పేర్కొన్నారు.




30నుంచి 'మా - ఎటెర్నల్ ట్రూత్' ప్రదర్శనలు

అడయార్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ భరతనాట్య విద్వాంసురాలు కలైమామణి బాలాదేవి చంద్రశేఖర్ మూడు రోజుల పాటు చెన్నైలో 'మా - ఎటెర్నల్ ట్రూత్' పేరుతో నృత్య ప్రదర్శన ఇవ్వనున్నారు. ఈ నెల 30న సాయంత్రం 5.30 గంటలకు స్థానిక మైలాపూర్‌లోని కార్తీక్ ఫైన్ ఆర్ట్స్‌లో, జనవరి 2వ తేదీ రాత్రి 7.30 గంటలకు మైలాపూర్‌లోని టీఏజీ దక్షిణామూర్తి ఆడిటోరియంలో ఉన్న బ్రహ్మజ్ఞాన సభలో, 4న మైలాపూర్‌లోని భవన్‌లో ఈ ప్రదర్శనలు ఇవ్వనున్నారు. ఈ తరహా ప్రదర్శనలను ఆమె కంబోడియాలో ఇవ్వగా, ఈనెల 21న మైసూర్‌లో ఇవ్వనున్నారు. ప్రకృతిని, తల్లి ప్రేమను వివరిస్తూ ఈ ప్రదర్శనలు సాగనున్నాయి. దీనిపై ఆమె మాట్లాడుతూ... మాతృత్వం అనేది మనందరినీ కలుపుతుంది. సమయం, స్థలాలకు అతీతమైన విశ్వవ్యాప్తం సత్యం. ఈ ప్రదర్శన ద్వారా తల్లికి అన్ని విధాలుగా కృతజ్ఞత, గౌరవం తెలియజేస్తా అన్నారు.




బాలాదేవి చంద్రశేఖర్

పళని, ఇడుంబన్ పర్వతాల మధ్య రోప్‌కార్



● రూ.32 కోట్లతో ప్రాజెక్టు సిద్ధం

టి.నగర్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): భక్తుల సౌకర్యార్థం పళని, ఇడుంబన్ పర్వతాల నడుమ రోప్‌కార్ సేవల ప్రాజెక్టును చేపట్టాలని పళని దేవస్థానం సంకల్పించింది. మురుగప్పెరుమాన్ ఏర్పాటు చేసుకున్న ఆరు దివ్యక్షేత్రాల్లో తృతీయ దివ్యక్షేత్రంగా పళని దండాయుధపాణి పర్వతాలయం కీర్తి గడించింది. ఈ ఆలయాన్ని దర్శించేందుకు రాష్ట్రం నలుమూలల నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాల నుంచి, విదేశాల నుంచి కూడా వేల సంఖ్యలో భక్తులు తరలివస్తున్నారు. కొండపై ఉన్న స్వామిని దర్శించుకునేందుకు వెళ్లడానికి ఎలక్ట్రిక్ వించ్, రోప్‌కార్ సదుపాయాలున్నాయి. వీటిలో రోప్‌కార్ సదుపాయం 2004లో ప్రారంభించారు. పళని పర్వత ప్రకృతి సౌందర్యాలను ఆస్వాదిస్తూ ఈ రోప్‌కార్‌లో భక్తులు ప్రయాణిస్తుంటారు. ఎలక్ట్రిక్ వించ్ కన్నా రోప్‌కార్‌లో పళనిపర్వతంపైకి వెళ్లేందుకు భక్తులు అత్యంత ఆసక్తి చూపుతున్నారు. ఈ రోప్‌కార్‌లో ఎనిమిది బాక్స్‌లున్నాయి. ఒక్కో బాక్స్‌లో ముగ్గురు చొప్పున భక్తులు కొండపైకి ప్రయాణించే వీలుంది. పళని పర్వతం లాగే పళని శివగిరిపట్టిలో కొడైకెనాల్ రోడ్డులో ఇడుంబన్ పర్వతం కూడా ఉంది. ఆ కొండదిగువ నుంచి కొండపైనున్న ఇడుంబన్ ఆలయానికి వెళ్లేందుకు 540 మెట్ల దారి ఉంది. ఆ మెట్లదారిలో నడచి ఇడుంబన్ కొండపైకి వెళ్లేందుకు భక్తులు శ్రమపడుతుంటారు. ప్రతి మంగళ, శుక్రవారాల్లో, ఆలయ ఉత్సవాల రోజుల్లో వేలసంఖ్యలో భక్తులు ఇడుంబన్ ఆలయాన్ని దర్శించేందుకు తరలివస్తుంటారు. ఈ పరిస్థితులో పళని పర్వతాలయానికి, ఇడుంబన్ పర్వతాలయానికి మధ్య రోప్‌కార్ సేవలు ప్రారంభించాలని భక్తులు యేళ్లతరబడి పళని దేవస్థానానికి, రాష్ట్ర దేవాదాయ శాఖకు పలుమార్లు విజ్ఞప్తి చేశారు. ఆ నేపథ్యంలో గత యేడాది శాసనసభ సమావేశాల్లో దేవాదాయ శాఖ మంత్రి పీకే శేఖర్‌బాబు తన శాఖకు సంబంధించిన ఆర్థికాంశాలు గురించి మాట్లాడుతూ... పళని పర్వతానికి, ఇడుంబన్ పర్వతానికి మధ్య రూ.32 కోట్లతో రోప్‌కార్ ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. ఆ మేరకు ఆ రెండు పర్వతాల నడుమ రోప్‌కార్ నడిపేందుకు సాధ్యాసాధ్యాలపై ఇంజనీరింగ్ సాంకేతిక నిపుణులతో పళని దేవస్థానం అధికారులు ఇటీవల సర్వేలు, పరిశీలనలు జరిపించింది. ఆ సర్వేల్లో రెండు పర్వతాల మధ్య రోప్‌కార్ నిర్మించేందుకు అనువైన పరిస్థితులే ఉన్నాయని వెల్లడైంది. దీంతో దేవస్థానం అధికారులు రోప్‌కార్ ప్రాజెక్టు ప్రణాళికలను రూపొందించే పనుల్లో నిమగ్నమయ్యారు. ఇది ఇలా ఉండగా ఇడుంబన్ పర్వతం నుంచి భక్తులు సులువుగా కొండదిగువకు చేరుకునే విధంగా దేవస్థానం టూరిస్టు కేంద్రం సమీపంలో సేకరించిన 58 ఎకరాల స్థలంలో కొంతభాగాన్ని ఇడుంబన్ పర్వతం పైనుంచి కిందకు దిగేలా రోప్‌కార్ వ్యవస్థను ఏర్పాటు చేయడానికి కేటాయించారు. పళని పర్వతం, ఇడుంబన్ పర్వతం మధ్య, ఇడుంబన్ పర్వతం నుంచి ఆ కొండదిగువ వరకు రోప్‌కార్ వ్యవస్థలు ఏర్పాటు చేస్తే ఆ రెండు క్షేత్రాలకు వచ్చే భక్తుల సంఖ్య విపరీతంగా పెరుగుతుందని దేవస్థానం అధికారులు పేర్కొన్నారు.



ఇడుంబన్ పర్వతాలయం



ఆకట్టుకుంటున్న 50 అడుగుల 'క్రిస్మస్ ట్రీ'

పెరంబూర్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): కోవైలోని ప్రో జోన్ మాల్‌లో ఏర్పాటు చేసిన భారీ క్రిస్మస్ ట్రీ సందర్శకులను ఆకట్టుకుంటోంది. ప్రపంచవ్యాప్తంగా క్రిస్మస్ పండుగలను ఈనెల 25వ తేది క్రైస్తవులు జరుపుకోనున్నారు. ప్రస్తుతం క్రిస్మస్ పండుగ వాతావరణం సర్వత్రా నెలకొంది. వాణిజ్య కాంప్లెక్స్‌లు, మాల్స్, సినిమా థియేటర్లు, జ్యువెలరీ షాపులు విద్యుద్దీపాల స్టార్స్‌తో ప్రత్యేక శోభను సంతరించుకున్నాయి. కోవై ప్రో జోన్ మాల్‌లో 'ఏ వెరీ మెర్రీ క్రిస్మస్' పేరుతో 50 అడుగుల క్రిస్మస్ ట్రీ ఏర్పాటు చేశారు. మాల్‌కు వచ్చే సందర్శకులు క్రిస్మస్ ట్రీ ముందు సెల్ఫీ తీసుకుంటూ సరదాగా గడుపుతున్నారు.

ప్రో జోన్ మాల్‌లో ఏర్పాటుచేసిన భారీ క్రిస్మస్ ట్రీ

అమిత్‌షా వ్యాఖ్యలు రికార్డుల్లోనే

● ఎంపీ కనిమొళి

అడయార్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేడ్కర్‌ను ఉద్దేశించి కేంద్ర హోం మంత్రి అమిత్‌షా వ్యాఖ్యలు రాజ్యసభ రికార్డుల్లో ఉన్నాయని డీఎంకే ఎంపీ కనిమొళి పేర్కొన్నారు. ఇటీవల రాజ్యసభలో అమిత్‌షా చేసిన వ్యాఖ్యలపై విపక్ష పార్టీలకు చెందిన నేతలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం రాత్రి ఢిల్లీ నుంచి చెన్నైకి విమానంలో వచ్చారు. ఈ సందర్భంగా అంబేడ్కర్‌ను కించపరిచేలా హోం మంత్రి అమిత్‌షా వ్యాఖ్యలు ఇపుడు రాజ్యసభ రికార్డుల్లో ఉన్నాయి. అంబేడ్కర్‌ను ఉద్దేశించి అమిత్ షా చేసిన వ్యాఖ్యలను నిరసనగా పార్లమెంట్ ఆవరణలో తామంతా నిరసన ర్యాలీ చేపట్టగా, దాన్ని అధికార పార్టీ సభ్యులు అడ్డుకున్నారు. రాహుల్ గాంధీని చుట్టుముట్టి సభలోకి వెళ్లకుండా అడ్డుకోగా, ఆ సమయంలో జరిగిన తోపులాటలో ఒక నేత కిందపడ్డారని కనిమొళి తెలిపారు. ఇలాంటి వాతావరణాన్ని ఉద్దేశపూర్వకంగా సృష్టించారన్నారు. ఈ ఘటనపై కాంగ్రెస్ పోలీసులకు ఫిర్యాదు చేసినా ఇప్పటివరకు ఎఫ్ఐఆర్ నమోదు చేయలేదన్నారు.

అమిత్ షా రాజీనామా చేయాలి: కాంగ్రెస్

రాజ్యాంగ నిర్మాణ అంబేడ్కర్‌ను కించపరిచేలా వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోం మంత్రి అమిత్‌షా తక్షణం తన పదవికి రాజీనామా చేయాలని కోరుతూ కాంగ్రెస్ నేతలు డిమాండ్ చేశారు. పోరూర్ జంక్షన్ వద్ద శనివారం జరిగిన ధర్నాలో ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దళపతి భాస్కర్, సీనియర్ నేత కేవీ తంగబాలు, రాష్ట్ర గౌరవ కార్యదర్శి రాంమోహన్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు టి.సెల్వం, అరుళ్ పొత్తయ్య, ఎస్‌డీ నెడుంజెళియన్, జిల్లా అధ్యక్షుడు ఎంఎస్ ద్రవ్యం, ఏ.ఆనంద్, జె.బాలమురగన్, కేవీ తిలగర్, జయం పెరుమాళ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమిత్ షాతో పాటు భారతీయ జనతా పార్టీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.



చెన్నై సచివాలయంలో సీఎం ఎంకే స్టాలిన్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకుని నాగపట్టినం మునిసిపాలిటీ పరిధిలోని నాగూరు తైకాల్ వీధికి దివంగత గాయకుడు నాగూర్ ఈఎం హనీఫా పేరు పెట్టినందుకు కృతజ్ఞతలు తెలుపుతున్న హనీఫా కుటుంబ సభ్యులు

వన చైతన్య రథం మూగబోయింది


టాస్క్‌ఫోర్స్ కార్యాలయం వద్ద మూలనపడ్డ ఎర్రచందనం వన చైతన్య రథం

శేషాచల కొండల్లోని ఎర్రచందనం అక్రమ రవాణాపై ప్రజల్లో చైతన్యం కల్పించడానికి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఎర్రచందనం వన చైతన్య రథం ప్రస్తుతం మూలనపడింది. అక్రమ రవాణా వల్ల కలిగే పరిణామాలపై అవగాహన కల్పించేందుకు 2019 ముందు ఐజీ క్యాడర్‌లో హెడ్ ఆఫ్ టాస్క్‌ఫోర్స్‌గా ఉన్న కాంతారావు దీన్ని ఏర్పాటు చేశారు. అటవీ సమీప గ్రామాలతో పాటు కూలీలుగా వస్తున్న తమిళనాడుకు చెందిన జవాదీ హిల్స్ పరిసర ప్రాంతాల్లోనూ ప్రజలకు అవగాహన కల్పించారు. అంతేగాక టోల్‌ఫ్రీ నంబర్ ప్రచారం చేయడంతో ప్రజలు కూడా అక్రమ రవాణాకు సంబంధించిన సమాచారం అందించేవారు. కాంతారావు బదిలీ తర్వాత ప్రచారానికి అవసరమైన నిధులు సమకూర్చే వారు లేకపోవడంతో ప్రచార రథం మూలనపడింది. ఐదేళ్లుగా నిరుపయోగంగా ఉంటూ తుప్పుపట్టే దశకు చేరింది. పైగా టోల్ ఫ్రీ నంబర్‌కు సమాచారం ఇచ్చేవారు కూడా కరువయ్యారు.


- మంగళం, (ఆంధ్రజ్యోతి)


సమ్యమేంద్రతీర్థకు శ్రీవారి ప్రసాదాలు అందజేస్తున్న ఆలయ అధికారులు

శ్రీవారిసేవలో కాశీ మఠాధిపతి

తిరుమల, డిసెంబరు21 (ఆంధ్రజ్యోతి): వారణాశి కాశీ మఠాధిపతి సమ్యమేంద్రతీర్థ స్వామి శనివారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఉదయం నైవేద్య విరామ సమయంలో శ్రీవారి ఆలయ మహద్వారం వద్ద టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి, అర్చకబృందం ఇస్తికఫాల్ స్వాగతం పలికారు. అనంతరం మూలవిరాట్టును దర్శించుకున్నారు.

సర్వదర్శనానికి 15 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 15 గంటల సమయం పడుతోంది. శనివారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని 22 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచిఉన్నారు.

గురువారం నాటి హుండీ ఆదాయం: రూ.3.75 కోట్లు

శుక్రవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 65,299

తలనీలాలు సమర్పించినవారు: 20,297

నేడు జాతీయ గణిత దినోత్సవం

లెక్కలు అందమైన భవితకు రెక్కలు



తిరుపతి (విశ్వవిద్యాలయాలు). తిరుపతిరూరల్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మనిషి భూమి మీద పడినప్పటి నుంచే లెక్కలు మొదలవుతాయి. ఏ తేదీన పుట్టాడు. ఎన్ని గంటలకు పుట్టాడు లాంటి లెక్కలు ఆ క్షణం నుంచే ప్రారంభమవుతాయి. అందుకే జీవితమంతా లెక్కలతోనే ముడిపడి ఉంటుంది. కానీ విద్యాభ్యాసం ఆరంభంలోనే లెక్కలంటే చాలామంది విద్యార్థులను భయం వెంటాడుతుంది. ఇదో కొరుకుడుపడని అంశంగా భావిస్తారు. భవిష్యత్‌కు ఈ లెక్కలే సోపానాలని అప్పుడు గ్రహించరు. అయితే ఈ లెక్కలను అర్థం చేసుకుంటే దీనంత సులువు మరొకటి ఉండదంటారు గణిత నిపుణులు. లెక్కలను భయంతో కాకుండా ఆసక్తితో నేర్చుకోవాలని హితవు పలుకుతుంటారు. ప్రాథమిక స్థాయి నుంచే లెక్కలంటే ప్రతికూలతను దూరం చేయాలంటారు. మనసుపై ముద్ర పడేలా బోధిస్తే లెక్కలేమంత కష్టం కాదంటున్నారు. ఇప్పుడున్న పోటీ ప్రపంచంలో లెక్కలు రాకపోతే అన్నీచిక్కులే. మ్యాథ్స్ లేని పోటీ పరీక్ష కాని, ఉన్నత చదువుగాని ఉండదంటే అతిశయోక్తి కాదు. పొరుగున ఉన్న తమిళనాడులో పేదరికంలో పుట్టినా లెక్కల్లో ఘనాపాఠిగా పేరుగాంచాడు రామానుజన్. ప్రపంచంలోనే మన దేశానికే ప్రత్యేకగుర్తింపు తెచ్చిపెట్టాడు. ఈయన జన్మదినాన్ని (డిసెంబరు22వ తేదీ) మ్యాథ్స్ దినంగా నిర్వహించుకుంటున్నాం. ఈ సందర్భంగా బాల్యం నుంచే లెక్కల్లో భళా అనిపించుకుంటున్న ఈ చిన్నారులేమంటున్నారో తెలుసుకుందాం.

గణిత విజ్ఞానంతో ముందడుగు



నిత్య జీవితంలో అనేక విషయాల్లో గణితాన్ని చూడవచ్చు. ప్రపంచ జనాభా సైతం గణితంలోనే విశ్లేషించుకోవలసి వస్తుంది. కరోనా వ్యాప్తి గణాంకాలను వివరించింది కూడా గణితమే. దూరాన్ని లెక్కల్లోనే కొలుస్తాం. ఇలా అన్నింటా కీలక పాత్ర పోషిస్తున్నందునే గణితానికి చాలా ప్రాధాన్యముంది. గణితం చదువుకున్న వారికి ఎన్నో ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయి. గణిత విజ్ఞానానికి కంప్యూటర్ పరిజ్ఞానాన్ని కూడా జోడిస్తే మరిన్ని ఉన్నత అవకాశాలు దక్కే అవకాశం ఉంటుంది. పోటీ పరీక్షల్లోనూ రాణించడానికి గణితం చాలా ఉపయోగపడుతూ ఉంది. కాలానుగుణంగా ఎన్ని మార్పులు వచ్చినా గణిత శాస్త్ర ప్రాముఖ్యత తగ్గకపోగా, పెరుగుతోంది.

- అనుపల్లె సుధాకరయ్య,
ఎస్వీయూనివర్సిటీ గణిత విభాగ ప్రొఫెసర్

చిన్నప్పటి నుంచి లెక్కలంటే ఇష్టం



తిరుపతి జీఎస్ మాడవీధిలోని శ్రీచైతన్యస్కూల్‌లో 8వతరగతి చదివుతున్నాను. ఇంటర్నేషనల్ టాలెంట్ సెర్చ్ ఒలింపియాడ్, నాలెడ్జ్ అసైన్‌మెంట్ పరీక్షల్లో బంగారు పతకాలు సాధించాను.

- వి.మోహిత్ వంశీరెడ్డి

గణితం వల్ల ఐఐటీలో సీటు



చిన్నప్పటి నుంచి గణితంపై చాలా మక్కువ. జాతీయస్థాయి సైనిక్ ప్రవేశపరీక్షల్లో గణితంలో 200కి 200మార్కులు వచ్చాయి. జేఈఈ మెయిన్స్ పరీక్షల్లోనూ వంద శాతం పర్సంటైల్ సాధించా. హైదరాబాద్ ఐఐటీలో ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ చదువుతున్నా. ఇదంతా లెక్కల్లో ఆసక్తి వల్లే సాధ్యమైంది.

- రోహిత్



ఒలింపియాడ్‌లో ఆరు పతకాలు

తిరుపతిలోని డాక్టర్ కిషోర్ రత్నం స్కూల్‌లో 9వతరగతి చదువుతున్నాను. ఇప్పటివరకు అంతర్జాతీయస్థాయి గణిత ఒలింపియాడ్‌లో ఆరుపతకాలు వచ్చాయి. గణితమంటే ఎంతో ఇష్టం. ఏటా గణిత ఒలింపియాడ్ పరీక్షలు రాస్తుంటాను. భవిష్యత్‌లో ఐఐటీ సాధనకు లెక్కలు ఉపయోగపడతాయనుకుంటున్నాను.

- షణ్ముఖప్రియ

అర్థం చేసుకుంటే ఈజీ



తిరుపతి మాతృశ్రీస్కూల్‌లో ఏడో తరగతి చదువుతున్నాను. రాష్ట్ర, జాతీయస్థాయి పోటీపరీక్షలకు వెళ్తుంటాను. ఇటీవల ఇంటర్నేషనల్ గణిత ఒలింపియాడ్ పరీక్షని రాశాను. అర్థం చేసుకుని చదివితే లెక్కలకిమించిన ఈజీ సబెక్టు మరొక్కటి లేదు.

- ఎన్.గురుదీప్,
7వతరగతి, మాతృశ్రీస్కూల్

అంతర్జాతీయ పతకమొచ్చింది



ఏఐఆర్ బైపాస్‌రోడ్డులోని శ్రీచైతన్య స్కూల్‌లో 9వతరగతి చదువుతున్నాను. అంతర్జాతీయస్థాయి గణిత ఒలింపియాడ్ సెకండ్ లెవల్(ఫైనల్)లో బంగారు పతకాన్ని సాధించాను. నాలెడ్జ్ అసైన్‌మెంట్ పరీక్షలోనూ అత్యుత్తమ ప్రతిభతో పతకాన్ని పొందాను. గణితంపై ఉన్న ఇష్టంతో ఐఐటీలో ఇంజినీరింగ్ చేయాలనుకుంటున్నాను.

-వేదశ్రీ

సంక్రాంతికి 230 ప్రత్యేక బస్సులు

తిరుపతి(ఆర్టీసీ), డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): భోగి, సంక్రాంతి పండుగలకు ఏపీఎస్ ఆర్టీసీ తిరుపతి కేంద్రంగా 230 ప్రత్యేక బస్సులను నడపనుంది. ఇక్కడి నుంచి హైదరాబాదు, విజయవాడ, బెంగళూరుకు సర్వీసులు నడపనున్నట్లు ఇన్‌చార్జ్ డిప్యూటీ సీటీఎం పి.విశ్వనాథం తెలిపారు. అమరావతి, ఇంద్ర, సూపర్‌లగ్జరి, అల్ట్రాడీలెక్స్, ఎక్స్‌ప్రెస్‌లు అందుబాటులో ఉంచామన్నారు. వచ్చేనెల 9నుంచి 13వ తేదీ వరకు రాను, 15నుంచి 17వ తేదీ వరకు పోను వేర్వేరుగా బస్సులు, వాటి రవాణా సయయాలను ఖరారు చేశామన్నారు. టిక్కెట్స్ రిజర్వేషన్ సౌకర్యం కల్పించామన్నారు. సాధారణ చార్జీలనే వసూలు చేయనున్నట్లు వివరించారు.

22 మెమూ రైళ్ల రద్దు

తిరుపతి(సెంట్రల్), డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : 22 మెమూ ప్యాసింజరు రైళ్లను ఈ నెల 26 నుంచి రద్దు చేస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీటీఎం కె.మణికుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో కాట్పాడి-తిరుపతి మధ్య రాకపోకలు సాగిస్తున్న 6, విశాఖపట్నం నుంచి రాజమండ్రి, పలాస, విజయనగరం మధ్య రాకపోకలు సాగించే 6, కాచిగూడ- మహబూబ్‌నగర్, నడుకుడి మధ్య 8, కాట్పాడి-జోలార్‌పేట మధ్య నడుస్తున్న 2 మెమూ ప్యాసింజర్లు ఉన్నాయని పేర్కొన్నారు. ఇవి ఈ నెలాఖరు నుంచి ఫిబ్రవరి వరకు వారణాసిలో నిర్వహించే కుంభమేళా భక్తులకు సేవలు అందించనున్నాయని తెలిపారు. అలాగే చెన్నై సమీపంలోని పెరంబూరు ఐసీఎఫ్ కోచ్ ఫ్యాక్టరీ నుంచి 22 రైలు పెట్టెలతో కూడిన 15 రైళ్లను పంపనున్నారని తెలిపారు. తిరుపతి నుంచి వారణాసి, అలహాబాదుకు కొన్ని ప్రత్యేక రైళ్లు నడపనున్నట్లు పేర్కొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

శ్రీకాళహస్తి, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): వచ్చే ఏడాది ఫిబ్రవరి 25 నుంచి మార్చి 6వ తేదీ వరకు జరిగే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో ధూర్జటి కళాప్రాంగణం, స్వామి, అమ్మవార్ల గ్రామోత్సవంలో పాల్గొనదల్చిన కళాకారుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆలయ ఈవో బాపిరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల కళాకారులు దరఖాస్తులను పూర్తి వివరాలతో పాటు ఫొటో, బ్యాంకు పాసుపుస్తకం జిరాక్స్ కాపీని పొందుపరుస్తూ జనవరి 20వ తేదీలోపు దేవస్థానం కార్యాలయంలో కానీ ఆలయ ఈమెయిల్ ద్వారా గానీ పంపాల్సిందిగా కోరారు.


అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

10 నుంచి ఫ్లెమింగో ఫెస్టివల్

తిరుపతి(కలెక్టరేట్), డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): వచ్చేనెల 10వ తేదీ నుంచి మూడు రోజుల పాటు ఫ్లెమింగో ఫెస్టివల్‌ను ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో ఎస్పీ సుబ్బరాయుడు, కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ జూ క్యూరేటర్ సెల్వం, పర్యాటక శాఖ రీజనల్ డైరెక్టర్ రమణ ప్రసాద్‌తో కలిసి ఆయన సమీక్షించారు. సీఎం ఆదేశాల మేరకు ఫ్లెమింగో ఫెస్టివల్‌ను పండుగ వాతావరణంలో నిర్వహించేలా చర్యలు చేపట్టాలన్నారు. ఈ ఉత్సవం గురించి దేశ, ప్రపంచ వ్యాప్తంగా పర్యాటకులకు తెలిసేలా విస్తృత ప్రచారం చేయాలని ఆదేశించారు. ఐదు ప్రాంతాల్లో నిర్వహించనున్న ఈ వేడుకలకు ఇన్‌చార్జి అధికారులను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. పులికాట్ సరస్సులో బోటు ప్రయాణానికి అవసరమైన ఏర్పాట్లు చేయాలని మత్స్యశాఖ అధికారులను ఆదేశించారు. సమావేశంలో సూళ్లూరుపేట ఆర్డీవో కిరణ్మయి, డీఎఫ్‌వో, జిల్లా పర్యాటకశాఖ అధికారి జనార్దన్‌రెడ్డి, ఏపీటీడీసీ ఈఈ సుబ్రహ్మణ్యం, డ్వామా పీడీ శ్రీనివాసప్రసాద్, జిల్లా మత్స్యశాఖ అధికారి నాగరాజు పాల్గొన్నారు.

నీలేష్‌కుమార్‌కు యంగ్ అచీవర్స్ అవార్డు


అవార్డు అందుకుంటున్న నీలేష్‌కుమార్

తిరుపతిరూరల్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): చెన్నై ఎస్ఆర్ఎం యూనివర్సిటీ పూర్వ విద్యార్థి, తిరుపతికి చెందిన కుప్పాల నీలేష్‌కుమార్ యంగ్ అచీవర్స్ అవార్డు అందుకున్నారు. వర్సిటీకి చెందిన 1991-2024 బ్యాచ్ విద్యార్థులకు వ్యవస్థాపక చాన్సలర్ డాక్టర్ టీఆర్ పారివేందర్, ప్రో చాన్సలర్ డాక్టర్ పి.రవిల నేతృత్వంలో అవార్డులను ప్రదానం చేశారు. ఏపీ నుంచి నీలేష్‌కుమార్ ఈ అవార్డు అందుకున్నారు. ఈయన తిరుపతికి చెందిన కుప్పాల గిరిధర్ కుమారుడు.

ఉత్కంఠగా అరణియార్ సాగునీటి సంఘ ఎన్నికలు

- రవిరెడ్డికి దక్కిన చైర్మన్ గిరి


రవిరెడ్డి - విజయకృష్ణ

పిచ్చాటూరు, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): అరణియార్ రిజర్వాయర్‌కు శనివారం చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక ఉత్కంఠ భరితంగా సాగింది. అదిష్టానం జోక్యంతో పిచ్చాటూరు టౌన్‌కు చెందిన రవిరెడ్డికి చైర్మన్ గిరి దక్కింది. వైస్ చైర్మన్‌గా నాగలాపురం మండలం కృష్ణాపురానికి చెందిన విజయకృష్ణ ఎన్నికయ్యారు. వైస్ చైర్మన్‌గా మొదటి నుంచి విజయకృష్ణను అనుకున్నారు. అయితే చైర్మన్‌గా నాగలాపురం పట్టణానికి చెందిన సెల్వ కుమార్, పిచ్చాటూరు పట్టణానికి చెందిన రవిరెడ్డి మధ్య హోరాహోరీ పోరు జరిగింది. అధిష్టానం జోక్యంతో చెరి రెండున్నర సంవత్సరాల ఒప్పందంతో మొదటి రెండున్నర సంవత్సరాలు (ప్రస్తుతం) రవిరెడ్డి నియామకం జరిగింది. రవిరెడ్డిని ఏఎంసీ మాజీ చైర్మన్, క్లస్టర్ ఇన్‌చార్జి ఇళంగోవన్‌రెడ్డి తన బృందంతో కలసి అభినందనలు తెలిపారు. అరణియార్ ప్రాజెక్టుకు ఐదుగురు ఆయకట్టు అధ్యక్షులు కాగా 60 మంది టీసీ మెంబర్లు ఉన్నారు. ఒక్కో అధ్యక్షుడిని 12 మంది టీసీ మెంబర్లు ఎన్నుకుంటారు. ఐదుగురు అధ్యక్షుల్లో చైర్మన్, వైస్ చైర్మన్‌లను ఎన్నుకోవడం పరిపాటి. ఎన్నికల అధికారిగా ఇరిగేషన్ ఈఈ రత్నాకర్‌రెడ్డి, డీఎస్పీ రవీంద్ర కుమార్, సీఐ రవీంద్ర, ఎస్ఐ వెంకటేశులు పాల్గొన్నారు.

72 బస్తాల రేషన్ బియ్యం స్వాధీనం

- ఒకరి అరెస్టు


స్వాధీనం చేసుకున్న బియ్యం

తిరుపతి(నేరవిభాగం), డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): తమిళనాడుకు తరలించడానికి సిద్ధంగా ఉంచిన 72 బస్తాల రేషన్ బియ్యాన్ని తిరుపతి రూరల్ పోలీసులు శనివారం స్వాధీనం చేసుకున్నారు. రూరల్ సీఐ చిన్నగోవిందు కథనం మేరకు.. తిరుపతి రూరల్ మండలం తనపల్లి ఇందిరమ్మ ఇళ్ల బ్లాక్ నెంబరు 22లో కాపురముంటున్న ఏ.రాజశేఖర్ తిరుపతి, తిరుపతి రూరల్ ప్రాంతాల్లో కార్డుదారుల నుంచి తక్కువ ధరకు రేషన్ బియ్యం కొనుగోలు చేసి, తమిళనాడుకు తరలిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. రూరల్ సీఐ చిన్నగోవిందు పర్యవేక్షణలో ఎస్ఐ రామకృష్ణ సిబ్బందితో కలసి అతని ఇంట్లో తనిఖీలు చేపట్టారు. స్టాకు ఉంచిన 72 బస్తాల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. దీని వెనుక ఇంకెవరైనా ఉన్నారా అనే కోణంలో విచారణ జరుపుతున్నారు.

స్వర్ణముఖి ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్‌గా దామెర


ప్రసాద్‌నాయుడు, శంకర్‌నాయుడులకు ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న ఎన్నికల అధికారి సుబ్రహ్మణ్యం, ఎమ్మెల్యే విజయశ్రీ

శ్రీకాళహస్తి, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : స్వర్ణముఖి ఆనకట్ట సిస్టమ్ ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్‌గా పెళ్లకూరు మండలం నెలబల్లి పంచాయతీ పరిధిలోని బీమవరం గ్రామానికి చెందిన దామెర ప్రసాద్ నాయుడు ఎన్నికయ్యారు. శ్రీకాళహస్తి ఇరిగేషన్ శాఖ కార్యాలయంలో శనివారం జరిగిన ఎన్నికలో కమిటీ సభ్యులు పెళ్లకూరు మండలానికి చెందిన పాపాడి రాజగోపాల్‌రెడ్డి, వేలూరు హరినాయుడు, మరుపూరు మస్తాన్‌రెడ్డిలతో పాటు బుచ్చినాయుడుకండ్రిగ మండలం ఆలత్తూరు గ్రామానికి చెందిన గురవయ్య కలిసి చైర్మన్‌గా దామెర ప్రసాద్‌నాయుడిని ఎన్నుకున్నారు. తొట్టంబేడు మండలం గుమ్మడిగుంట గ్రామానికి చెందిన శంకర్‌నాయుడు వైస్ చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వీరికి నీటిపారుదల శాఖ ఈఈ, ఎన్నికల అధికారి సుబ్రహ్మణ్యం మంజుల ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం, టీడీపీ పెళ్లకూరు మండలాధ్యక్షుడు సంచి కృష్ణయ్య, స్వర్ణముఖి ప్రాజెక్ట్ కమిటీ మాజీ చైర్మన్ పేరం రమేష్‌నాయుడు, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వేలూరు మురళీకృష్ణారెడ్డి, రాష్ట్ర సర్పంచుల సంఘం నాయకులు కందమూడి శివకుమార్, దేవారెడ్డి నాగేంద్రప్రసాద్‌రెడ్డి, నేలవల్లి సిద్దులయ్య నాయుడు, మదన్‌మోహన్‌నాయుడు, మురళీనాయుడు, కృష్ణమనాయుడు, మునిరామయ్య, రవినాయుడు వారిని అభినందించారు.

రాక్షసుడితో రాజీ అబద్ధం

- తప్పుడు కథనాలు బాధాకరం
- వైసీపీ అరాచకాలను వదిలే ప్రసక్తే లేదు
- శ్రీకాళహస్తి ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి



శ్రీకాళహస్తి, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): 'ఐదేళ్ల పాటు ఒక నరరూప రాక్షసుడితో పోరాడాను. నాపై అక్రమంగా 19 కేసులు బనాయించాడు.. ఎన్నికైన రోజు నుంచే పాపాత్ముడి అరాచకాలపై అలుపెరగకుండా పోరాడుతున్నాను. వైసీపీ అక్రమాలను వెలికితీస్తున్నా.. తప్పులు చేసిన మాజీ ఎమ్మెల్యేతో సహా పలువురు వైసీపీ నాయకులపై కేసులు నమోదయ్యాయి.. ఇలా వైసీపీ అరాచక, అక్రమాలపై చర్యలు తీసుకుంటుంటే ఆ రాక్షసుడితో రాజీపడినట్లుగా కొందరు కథనాలు రాయడం మనస్సును తీవ్రంగా గాయపరుస్తోంది. రాక్షసుడితో రాజీ అబద్ధం' అని ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి స్పష్టం చేశారు. స్థానిక పంచాయతీ రాజ్ అతిథిగృహంలో శనివారం పొద్దుపోయాక రాత్రి మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. తొలిరోజు నుంచే రాజీవ్ నగర్‌లో వైసీపీ అక్రమ కట్టడాలను తొలగింపు చర్యలు చేపట్టామని, శ్రీకాళహస్తీశ్వరాలయంలో వైసీపీ ఆగడాలకు అడ్డుకట్ట వేశామన్నారు. స్వర్ణముఖి నది ఒడ్డున రోడ్డును ఆక్రమించి చేసిన కట్టడాల తొలగింపునకు శ్రీకారం చుడితే మాజీ ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి హంగామా సృష్టించి అధికారులపై వీరంగం సృష్టించడంతో కేసు నమోదు అయినట్లు చెప్పారు. దక్షిణ కైలాసనగర్‌లో మాజీ ఎమ్మెల్యే బావమరిది ఆక్రమించుకున్న భూమిని సంబంధిత వ్యక్తులకు ఇప్పించిన విషయాన్ని తెలియజేశారు. రేణిగుంట మండలంలో వందల అక్రమ కట్టడాలను ఒకే రోజు తొలగించామని చెప్పారు. మున్సిపల్ పరిధిలో పలు అక్రమ కట్టడాలను గుర్తించామని అయితే ఇదివరకు పనిచేసిన కమిషనర్ రమేష్ బాబు వారిని కోర్టుకు వెళ్లేలా చేశారని తెలిపారు. దీనివల్ల ఆ అక్రమ నిర్మాణాల కూల్చివేత ఆగిందన్నారు. వైసీపీ ఆక్రమాలను ఏ ఒక్కటీ వదిలిపెట్టే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు. రెవెన్యూ సదస్సులు పూర్తయిన తర్వాత మళ్లీ మీడియా ముందుకొచ్చి నియోజకవర్గ వ్యాప్తంగా వైసీపీ భూఆక్రమణల వివరాలను వెల్లడిస్తానని స్పష్టంచేశారు.

శ్రీసిటీలో టొయామా ప్రతినిధుల బృందం



శ్రీసిటీ, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): జపాన్‌లోని టొయామా రాష్ట్రానికి చెందిన 16 మంది సభ్యులు, ప్రభుత్వ ఉన్నతాధికారుల బృందం శనివారం శ్రీసిటీని సందర్శించింది. టొయామా అసోసియేషన్ ఆఫ్ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్, హొకురికు బ్యాంక్ సీనియర్ సలహాదారు హిడెనోరి మగినో నేతృత్వంలో వచ్చిన బృంద సభ్యులకు శ్రీసిటీ మార్కెటింగ్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ ఆర్.శివశంకర్ స్వాగతం పలికి, శ్రీసిటీ ప్రగతి ప్రత్యేకతలు, పారిశ్రామిక అనుకూలతలను పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. నిర్మాణాత్మక పారిశ్రామిక పార్కును అభివృద్ధి చేయడంలో శ్రీసిటీ యాజమాన్య కృషిని వారు అభినందించారు. భారత్, టొయామా మధ్య వ్యాపార బంధం మరింత బలపడేందుకు ఈ పర్యటన ఉపయోగపడుతుందని శ్రీసిటీ ఎండీ రవీంద్ర సన్నారెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

పల్లె పండుగ పనులు వచ్చే నెలాఖరుకు పూర్తి కావాలి

తిరుపతి(కలెక్టరేట్), డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): పల్లె పండుగలో భాగంగా జిల్లాకు కేటాయించిన పనులు జనవరి చివరి నాటికి పూర్తి చేయాలని కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం రాత్రి కలెక్టరేట్ నుంచి సంబంధిత అధికారులతో వర్చువల్ విధానంలో సమీక్షించారు. పల్లె పండుగలో భాగంగా జిల్లాకు రూ.200కోట్ల విలువైన పనులు కేటాయించారని, ఇందులో 70 శాతం సంక్రాంతి నాటికి, మిగిలిన 30 శాతం జనవరి చివరి నాటికి పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ నెల 31 నాటికి అనిమల్ షెల్టర్స్ 900 పూర్తి చేయాలని సూచించారు. సమావేశంలో డ్వామా పీడీ శ్రీనివాస ప్రసాద్, జిల్లా పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ అధికారి రామ్మోహన్, ఎంపీడీవోలు, డ్వామా సహాయ ప్రాజెక్ట్ అధికారులు పాల్గొన్నారు.

22.40 కిలోల గంజాయి స్వాధీనం

- ఏడుగురి అరెస్టు

వెంకటగిరి టౌన్, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): వెంకటగిరి రైల్వేస్టేషన్ వద్ద 22.40 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని ఏడుగురిని అరెస్టు చేసినట్లు సీఐ ఏవీ రమణ తెలిపారు. శనివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో మీడియాకు వివరాలు వెల్లడించారు. ముందుగా అందిన సమాచారం మేరకు వెంకటగిరి రైల్వేస్టేషన్ సమీపంలోని ముళ్లపొదల వల్ల గంజాయి విక్రయిస్తున్న పట్టణానికి పెనుబర్తి గణేష్, యకసిరి చైతన్య, నక్కల నాని, లేబాకు జనార్దన, తంగా పేచిరాజ్, ఇద్దరు మైనర్లను అదుపులోకి తీసుకున్నామని సీఐ తెలిపారు. వీరి వద్ద నుంచి 22.40కిలో గంజాయిని, రెండు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నామని, వాటి విలువ సుమారు రూ.2,46,400 ఉంటుందన్నారు. అలాగే పట్టణంలోని గంజాయి సేవించే 30మందికి కౌన్సెలింగ్ ఇచ్చామన్నారు. అదే విధంగా వివిధ కేసుల్లో నిందితులుగా ఉన్న పెనుబర్తి గణేష్, యకసిరి చైతన్య, నక్కల నాని, లేబాకు జనార్దన్ వద్ద నుంచి 11 మోటార్ సైకిళ్లు, పది పొట్లేళ్లు, రూ.లక్ష స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.